
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 29 జూలై 2025





సాగర్ డ్యాం నుంచి జవహర్ కుడికాలువకు నీటి సరఫరా

కుడికాల్వకు నీటి విడుదల

- 5వేల క్యూసెక్కులకు పెంచిన అధికారులు

● సాగు, తాగు నీటి అవసరాలకు 132 టీఎంసీలు ● మరో 24 టీఎంసీలకు పెంచాలని ప్రతిపాదనలు ● నేడు సాగర్ గేట్లు తెరవనున్న తెలంగాణ మంత్రులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నిండు కుండలా దర్శనమిస్తోంది. దీంతో జవహర్ కుడి కాల్వకు డ్యాం నుంచి నీటి విడుదలను 500 నుంచి 5 వేల కూసెక్కులకు పెంచినట్లు జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు. సాగు, తాగు అవసరాలకు 132 టీఎంసీలు నీటిని కేటాయించారు. అయితే మరో 24 టీఎంసీలు కేటాయించాలని కోరుతూ జలవనరుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. జూలైలోనే పుష్కలంగా సాగునీరు సరఫరా చేయడం 18 ఏళ్లలో ఇదే తొలిసారి. వర్షాలు సమృద్ధిగా కురవడంతో పత్తి, కంది, మొక్కజొన్న పంటలను రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారు. మరో వైపు నీరు విడుదల కావడంతో వరి సాగు పనులు ముమ్మరమయ్యాయి.



సాగర్ డ్యాంకు జలకళ

నేడు తెరచుకోనున్న సాగర్ గేట్లు

సాగర్ జలాశయంలో నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో డ్యాం క్రస్ట్ గేట్లను మంగళవారం తెరచి పులిచింతలకు నీటిని (మిగతా 6లో)



నిజాంపట్నం కాల్వపై తురుమెళ్ల వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన

దినదిన గండం.. ప్రయాణం

శిథిలావస్థలో ప్రధాన వంతెనలు

అమృతలూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరు మండల పరిధిలోని పలు ప్రధాన వంతెనలు శిథిలావస్థకు చేరడంతోపాటు, కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలో కృష్ణా పశ్చిమ డెల్టా తూర్పు, నిజాంపట్నం, పశ్చిమ ప్రధాన కాల్వ ఆయా గ్రామాల వద్ద ఉన్న వంతెనలు ప్రమాద భరితంగా మారాయి. పెదపూడి- పెరవలిపాలెం వెళ్లే రోడ్డులో ఎల్ జీ కాలువపై ఉన్న వంతెన కింద భాగంలో ఉన్న ఇనుప గడ్డర్ విరిగిపోవడంతో పాటు, వంతెనపైన కొద్దిభాగం కుంగిపోయింది. దీంతో ఈ వంతెన ఎప్పుడు కూలుతుందో అని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. నిజాంపట్నం కాల్వపై తెనాలి - చందోలు ప్రధాన రహదారిలో పెదపూడి వంతెన వద్ద ఉన్న వంతెన ప్రమాద భరితంగా మారింది. ఈ వంతెన రెండు పక్కల దెబ్బతినడంతో వాహనదారులు కాల్వలో పడుతున్న ఘటనలు ఉన్నాయి. తురుమెళ్ళ వద్ద తూర్పుకాల్వ, నిజాంపట్నం కాల్వపై ఉన్న వంతెనలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. ఇక్కడ నిజాంపట్నం కాల్వపై ఉన్న వంతెన కొద్దిభాగం కిందకు కుంగిపోయింది. ఈ వంతెనలు ప్రమాదకరంగా ఉండటంతో గుంటూరు నుంచి అమృతలూరు నడిచే బస్సును కూడా ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. ప్యాపర్రు వద్ద పశ్చిమ కాల్వపై ఉన్న వంతెన సైడ్ దెబ్బతిని ప్రమాద భరింతంగా మారింది. కాల్వల ఆధునికీకరణ పనుల్లో నూతన వంతెనల నిర్మాణం చేస్తారని ఆశించారు. ప్రభుత్వం స్పందించి వంతెనల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఎల్‌జీ చానల్‌పై శిథిలావస్థకు చేరిన పెదపూడి వద్ద వంతెన

సహకారం దొరికేనా!



ఐదేళ్లుగా నిర్వీర్యమైన పీఏసీఎస్‌లు

- 82 సొసైటీలకు త్రిసభ్యకమిటీల నియామకం
- రికార్డుల డిజిటలైజేషన్ ఇప్పటికే పూర్తి
- అడ్డగోలుగా రుణాలు దోచేసిన పది ఖాతాల గుర్తింపు
- ఎరువుల విషయంలో తప్పని ఎదురుచూపులు
- త్రిసభ్య కమిటీల రాకతో పీఏసీఎస్‌లు గాడిన పడేనా?



నూజెళ్లపల్లి పీఏసీఎస్ కార్యాలయం

అన్నదాతలకు రుణాలు మొదలుకుని, ఎరువుల వరకు వెన్నుదన్నుగా ఉండడానికి పీఏసీఎస్(ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ)లు కీలక పాత్ర వహిస్తూ వచ్చాయి. కానీ గత ప్రభుత్వం అవలంభించిన అస్తవ్యస్త విధానాలతో ఓ దశలో సొసైటీల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల విధానానికి స్వస్తి చెప్పి అర్హత లేని వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టి సొసైటీలను దోచేయడానికి అధికారిక లైసెన్సు ఇచ్చింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో సొసైటీల్లో ఆడిట్ అనేది తూతూమంత్రంగా జరిగిందే తప్ప అక్రమార్కులపై చర్యలు మాత్రం శూన్యం. కేవలం వైసీపీ నేతల సిఫారసులే ప్రామాణికంగా రైతులు కాకపోయినా సొసైటీల ద్వారా రుణాలు ఇచ్చిన ఉదంతాలు ఐదేళ్లలో కోకొల్లలు. సహకార సంఘాల్లో ఎరువుల విక్రయాన్ని దాదాపుగా అటకెక్కించారు. దీంతో సహకార సొసైటీల వ్యవస్థే పూర్తిగా గాడి తప్పింది. ఈ ప్రభుత్వం గద్దెనెక్కాక తొలుత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది మార్చికల్లా ఆ ఘట్టాన్ని ఓ కొలిక్కి తేగలిగింది. రికార్డులు కంప్యూటరీకరణ జరుగుతున్న సమయంలోనే సమాంతరంగా గతంలో జరిగిన అవకతవకలపై కూడా అధికారులు దృష్టి సారించారు. పెద్దమొత్తంలో గోల్‌మాల్ జరిగిన దాదాపు పది ఖాతాలను కూడా యంత్రాంగం గుర్తించింది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

82 సొసైటీలకు త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం నియమించింది. ఎన్నికలు జరిపే పాలక వర్గాలను కొలువు దీర్చాలని తొలుత ప్రభుత్వం అనుకున్నా నిబంధనల చిక్కుల వల్ల త్రిమెన్ కమిటీల వైపే ప్రభుత్వం మొగ్గు చూపింది. జిల్లాలో మొత్తం 112 పీఏసీఎస్‌లకు గాను 82కి నియామకాలు పూర్తి కాగా, ఇంకా 30 పెండింగ్‌లో ఉన్నాయి. నేడో, రేపో వీటికి కూడా త్రీమెన్ కమిటీలను ప్రభుత్వం ప్రకటించింది. గాడి తప్పిన సొసైటీలకు పునరుజ్జీవం కల్పించాల్సిన గురుతర బాధ్యత కూడా ఈ కమిటీలపైనే ఉంది. గతంలో లాగా పీఏసీఎస్‌లు అన్నదాతల ప్రయోజనాల కోసం పనిచేసేలా ప్రణాళికలు రూపొందించి, పూర్తి సహకారం దక్కేలా చూడాలనేది అన్నదాతల అభ్యర్థనగా ఉంది

ఎరువుల లభ్యతపై దృష్టి పెట్టాలి

ఖరీఫ్ సాగు ముమ్మరంగా జరుగుతున్నప్పటికీ ఇప్పటికీ పీఏసీఎస్‌లలో ఎరువుల జాడే లేదు. మార్క్‌ఫెడ్ నుంచి సొసైటీలకు ఎరువులు కేటాయిస్తే వాటిని ఎమ్మార్పీ ధరలకే విక్రయించనున్నారు. ఎరువుల కోసం దూరం వెళ్లకుండా గ్రామంలోని సహకార సొసైటీల్లోనే అందుబాటులో (మిగతా 6లో)

నేడు జిల్లాకు సీఎస్ రాక

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మంగళవారం బాపట్లకు రానున్నారు. ఉదయం 11:30కు కలెక్టరేట్‌లో ఆర్డీఎస్ఎస్ వర్క్సపై సమీక్ష జరపనున్నారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న పనులను పరిశీలిస్తారు మధ్యాహ్నం 2:30కు చీరాలలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులపై సమీక్షిస్తారు. పీ4తో పాటు వివిధ అభివృద్ధి పనుల పురోగతి కూడా సీఎస్ సమీక్షలో చర్చకు రానున్నట్లు సమాచారం.


అ'ధర'గొడుతున్న మిర్చి, టామాటా!





మార్టూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మార్టూరు కూరగాయల మార్కెట్‌లో మిరప, టమాటాకు డిమాండు పెరుగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులకు సోమవారం మార్కెట్లో కిలో మిర్చి రూ.85, టమాటా రూ.30 నుంచి రూ.50 వరకు ధర పలికింది. ఇక దుకాణాల్లో మరింత ఎక్కువ ధర చెల్లించి వినియోగదారులు కొనుగోలు చేయాల్సి ఉంది. స్థానిక రైతుల నుంచి టమాటా, మిర్చి దిగుబడి తగ్గడంతో.. కమీషన్ ఏజంట్లు చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటక, అనంతపురం నుంచి టమాటాను దిగుమతి చేసుకుంటున్నారు. నేల, పందిళ్లపైన సాగు చేసిన టమాటా పంట నాణ్యతను బట్టి మార్కెట్లో ధర పలుకుతోంది. 25 నుంచి 27 కిలోలు ఉండే టమాటా బాక్స్ రూ.500 నుంచి రూ.1,100 వరకు విక్రయిస్తున్నారు. డిసెంబరు నుంచి స్థానిక రైతుల నుంచి మార్టూరు మార్కెట్‌కు టమాటా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. 40 రోజుల నుంచి టమోటాకు డిమాండు బాగానే ఉంది. 20 రోజుల నుంచి మిర్చికి గిరాకీ పెరిగింది. పులివెందుల, మైదుకూరు, డోన్‌ల నుంచి మార్కెట్‌కు మిరప కాయలు వస్తున్నాయి. మార్చి నుంచి మే నెల వరకు రేపల్లె, బాపట్ల తదితర ప్రాంతాలు నుంచి, స్థానిక రైతుల నుంచి మిర్చి బస్తాలు మార్కెట్ కు వస్తుంటాయి. మరికొన్ని రోజులు ఈ రెండు కూరగాయలకు డిమాండ్ ఇలానే కొనసాగే అవకాశం ఉంది.

హలో.. మాస్టారూ!





మీ ఫైల్ పూర్తయింది ఒక్కసారి కలవండి..!

జడ్పీలో ఫైల్స్ కదలాలంటే పర్సంటేజీ ముట్టాల్సిందే. ఇది ఉపాధ్యాయులకూ తప్పడం లేదు. ఉపాధ్యాయులు పీఎఫ్ రుణం, విశ్రాంత ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఫైల్ పూర్తయింది.. తమని కలవాలంటూ పరిషత్‌లోని పీఎఫ్, ఆడిట్ విభాగాల నుంచి వారికి ఫోన్లు వస్తున్నాయి. వారితో పర్సంటేజీలు మాట్లాడుకున్న తర్వాతే..ఫైల్స్ ముందుకు కదులుతున్నాయి. లేకుంటే.. ఏదో ఒక కొర్రీ పెట్టి పెండింగ్ పెడుతున్నారు.

- పీఎఫ్ రుణం, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కూ పర్సంటేజీ..
- జడ్పీలో పీఎఫ్, ఆడిట్ సిబ్బంది వేధింపులు
- గగ్గోలు పెడుతున్న ఉపాధ్యాయులు

గుంటూరు (విద్య) జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పీఎఫ్, ఆడిట్ విభాగాల నుంచి వచ్చే ఫోన్లతో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు బెంబేలెత్తిపోతున్నారు. తాము దాచుకున్న డబ్బు. రుణం రూపంలో పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దయనీయమైన స్థితి నెలకొందని ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవి విరమణ చేసిన ఉపాధ్యాయులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కాళ్లు అరిగేలా జడ్పీ కార్యాలయంలోని విభాగాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇటీవల దాదాపు 55 మంది (మిగతా 6లో)

సంతానోత్పత్తి కేంద్రాలను.. తనిఖీ చేయండి



6

● లోపాలుంటే సమగ్ర నివేదిక అందజేయండి ● వైద్య ఆరోగ్య శాఖకు ప్రభుత్వ ఆదేశాలు

ఉచిత ప్రయాణంపై కసరత్తు



6

- ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న ఆర్టీసీ యంత్రాంగం
- రేపు గుంటూరులో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు సమావేశం

రియల్ మోసం

- అంపాపురంలో వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ దారుణం
- కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టి పరార్
- మోసపోయిన వారిలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందినవారు

6

ఇసుకకు ఇబ్బంది రాకూడదు : కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక సరఫరాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటమురళి అధికారులకు సూచించారు. రాష్ట్రప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో భాగంగా ఐవీఆర్ఎస్‌లో ప్రజాభిప్రాయ సేకరణపై వచ్చిన ప్రతికూలతపై, సోమవారం కలెక్టర్ ఇసుకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టన్ను ఇసుకకు ఎంత వసూలు చేస్తున్నారో సంబంధిత వివరాలను కొనుగోలు చేసిన వ్యక్తులతో నేరుగా ఫోన్ చేసి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ వసూళ్ళ చేస్తున్నట్లు వారు వివరించారు. అసంతృప్తిగా ఉన్నట్లు వివరించారు. జిల్లాలో గాజుల్లంక రీచ్ నుండి మాత్రమే ఇసుకను సరఫరా చేయటం జరుగుతుందని ప్రస్తుతం అక్కడకు లారీలు వెళ్ళడానికి ఇబ్బందికర పరిస్థితులు ఉండటం వలన ఇతర ప్రాంతాలు నుంచి ఇసుకను సరఫరా చేయటంలో ధరలో మార్పు వచ్చిందని కమిటీ సభ్యులు ఈ సంర్భంగా కలెక్టర్‌కు వివరించారు. గాజుల్లంక రీచ్ నుండి ఇసుకసరఫరాకు దారిమార్గం తేమ లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రీచ్‌లో కేవలం 20వేల టన్నులు మాత్రమే ఇసుక నిల్వ ఉందని రాబోవు రెండునెలలకు మాత్రమే ఇది సరిపోతుందని వివరించారు. ఇసుక కొరతను అధికమించటానికి ఇతర జిల్లాల నుంచి ఇసుకను బాపట్లకు తరలించి నిల్వచేయాలని గనులశాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. రీచ్‌ల వద్ద ఇసుకను ప్రభుత్వం నిర్ణయించిన టన్నుల కంటే ఎక్కువ మోతాదులో లారీలో నింపినట్లైతే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, చేతివాటం ప్రదర్శించకుండా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, గనులశాఖ ఏడి డి.రామచంద్ర, రవాణా శాఖాధికారి పరందామరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఇసుకకమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

◆ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులు మరింతగా అందిపుచ్చుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ కోరా రు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. గడచిన ఆరు నెలల్లో నమోదైన కేసులకు సంబంధించి పురోగతి, భవిష్యత్తులో సాధించాల్సిన లక్ష్యాలను గురించి ఆయన పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో మరింత తగ్గుదల నమోదవ్వాలని, రోడ్ సేఫ్టీ నిబంధనలకు సంబంధించి ప్రజల్లో కూడా అవగాహన పెంచాలని ఎస్పీ కోరారు. విధులలో ప్రజలకు మెరుగైన సేవలందిస్తేనే యూనిఫాంకు విలువ పెరుగుతుందన్నారు. స్టేషన్ మెట్లెక్కే బాధితులతో బాధ్యతగా మెలగాలన్నారు. రాత్రిపూట గస్తీ విధులను మరింత పటిష్టం చేయాలన్నారు. గంజాయితో పాటు ఇతర మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపాలని, వీటి కట్టడి కోసం ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు

ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి..

గడచిన ఆరు నెలల వ్యవధిలో అనేక విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్పీ తుషార్ డూడీ ప్రశంసాపత్రాలు అందించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూసిన సీఐలు సుబ్బరాజు, రాంబాబులు ప్రశంసా పత్రాలు అందుకున్నవారిలో ఉన్నారు. దొంగతనాల కేసులకు గాను ప్రాపర్టీ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను సీఐలు మల్లికార్జున రావు, హరికృష్ణ, శేషగిరిరావు, సుబ్బారావు, ఆంజనేయులు, సురేష్ బాబులను ఎస్పీ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

ఘనంగా లావు రత్తయ్య పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను నిర్వహించారు. డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు మాత్రమే తారతమ్య భేదాలు లేకుండా శుభాకాంక్షలు తెలియజేస్తారని అన్నారు. విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తే తాను ఇంకా ఎక్కువ సంతోషిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో హైద రాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు, ఎన్విదా సీనియర్ ఏఎస్ఐసీ మేనేజర్ మౌనిక, వర్సిటీ వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ ఎల్ రాణి రుద్రమదేవి, సీఈవో మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, లారా ప్రిన్సిపాల్ కే ఫణీంద్రకుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాసబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జే మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఆచార్య నాగభూషణం, సుబ్బారావు తదితరులు

గుంటూరు(విద్య), జూలై 28 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ ఆర్థిక సౌజన్యంతో స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ పావులూరి సుబ్బారావు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్యలు రిబ్బన్ కట్ చేసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ పావులూరి సుబ్బారావుతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు.

రియల్ మోసం

(ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్)

గన్నవరంలో మరో 'రియల్' మోసం వెలుగుచూసింది. గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం అంపాపురంలో భారీ వెంచర్ వేసి ప్లాట్లు విక్రయించిన వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన బాధితులు పెద్దసంఖ్యలో ప్లాట్లు కొని మోసపోయారు. ప్లాట్లు విక్రయించిన వీవీఆర్ యాజమాన్యం అదృశ్యమైంది. కొనుగోలు చేసిన ప్లాట్లు వ్యవసాయ పొలాలుగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. ఏకంగా వారి పేరుతో రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. తమ ప్లాట్ల దగ్గరకు వెళ్తున్న కొనుగోలుదారులను చూసి.. స్థానికుల ఆ స్థలాలు మావి అంటూ అడ్డుకుంటున్నారు. దీంతో మొత్తం 80 మంది బాధితులు సోమవారం బస్సులో బాపులపాడు తహసీల్దార్ మురళీకృష్ణను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మోసంలో కృష్ణాజిల్లాతో పాటు గుంటూరు, తెనాలికి చెందిన వందల మంది మధ్యతరగతి వారు బాధితులుగా ఉన్నారు. వీరిలో విశ్రాంత అధికారులతో పాటు ఆర్మీకి చెందినవారు కూడా ఉన్నారు.

- అంపాపురంలో వీవీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ దారుణం
- కొనుగోలుదారుల నెత్తిన శఠగోపం పెట్టి పరార్
- ప్లాట్లు కొన్నవారి స్థలాల్లో మరో రిజిస్ట్రేషన్
- మోసపోయిన వారిలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందినవారు
- విశ్రాంత అధికారులతో పాటు ఆర్మీలో పనిచేసిన వారికీ టోకరా
- బాపులపాడు తహసీల్దార్‌ను ఆశ్రయించిన బాధితులు



అంపాపురంలో తమ ప్లాట్ల వద్ద బాధితుల ఆందోళన

జరిగింది ఇలా..

అంపాపురం గ్రామంలోని సర్వే నెంబర్ 201-1, 203-1, 210-2, 213-2లో సుమారు 44 ఎకరాల్లో 33 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చినట్టు ప్రచారం చేసి 2010లో వీవీఆర్ హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వెంచర్ వేసింది. కృష్ణా, గుంటూరు, తెనాలి జిల్లాలకు చెందిన సుమారు 443 మందికి ప్లాట్లను విక్రయించింది. నాటి పంచాయితీ అధికారి సంతకంతో కూడిన లేఅవుట్ ప్లాన్, పంచాయితీకి కట్టిన రశీదుల ఆధారంగా ఆ సంస్థ రిజిస్ట్రేషన్లు చేసింది. కాగా, 2020, ఆ తర్వాత కొందరు వ్యక్తులు వెంచర్ వేసిన ఈ భూమిలోని 13 ఎకరాలను వ్యవసాయ భూమిగా చూపించి రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతో పాటు పట్టాదారు పాసు పుస్తకాలు కూడా పొందడం గమనార్హం. అయితే, వెంచర్‌లో ప్లాట్లు కొన్న వారిలో కొందరు కంచె వేసుకునే ప్రయత్నాలు చేయగా, స్థానికంగా కొందరు అడ్డుకున్నారు. అప్పటికే వీవీఆర్ నిర్వాహకులు పత్తా లేకుండాపోవడంతో మోసపోయామని గ్రహించిన కొనుగోలుదారులు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో కొనుగోలుదారుల్లో 80 మందికిపైగా బాధితులు కమిటీగా ఏర్పడి సోమవారం బస్సులో వెళ్లి తహసీల్దార్ మురళీకృష్ణను కలిశారు. తమ దగ్గరున్న సర్వే నెంబర్లు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో కూడిన ఆధారాలను చూపించి న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయేతర భూమికి రెవెన్యూ వారు పట్టాదారు పాసు పుస్తకాలు ఎలా ఇచ్చారని, భీమవరపు సాంబిరెడ్డి అనే వ్యక్తికి వ్యయసాయ భూమిగా ఎలా అమ్మారని, దానికి రిజిస్ట్రేషన్ల శాఖ ఎలా అంగీకరించిందని ప్రశ్నించారు. వ్యవసాయేతర భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం రెవెన్యూ తప్పిదంగా భావించి ఆ పాసు పుస్తకాలను రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపానని, ప్లాట్లను అప్పగించడం వంటి విషయాలు రెవెన్యూ పరిధిలోకి రావని మురళీకృష్ణ వారికి చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు వేయడం, అమ్మడం చేస్తూ మోసం చేస్తున్నారని కొనుగోలు చేసే ముందు అన్ని విషయాలు పరిశీలించాలని హితవు పలికారు.

నాడు అధోగతి.. నేడు పురోగతి

● బుగ్గవాగు రిజర్వాయర్‌కు 3, 6 క్రస్ట్ గేట్లు ఏర్పాటు ● ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కాంతారావు

రెంటచింతల,జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నాలుగు జిల్లాల రైతుల జీవనాడి బుగ్గవాగు రిజర్వాయర్‌ను ఐదేళ్లుగా పట్టి పీడిస్తున్న మరమ్మతులు సమస్య ఒక కొలిక్కి వచ్చింది. సాగు నీటి కోసం అన్నదాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నేడు తొలగిపోయాయి. తుప్పు పట్టి పట్టుకుంటే ఊడిపోయే విధంగా ఉన్న 3,6 క్రస్ట్ గేట్ల స్థానంలో నూతన గేట్లను అమర్చే ప్రక్రియను కూటమి ప్రభుత్వం చేపట్టి సోమవారం నాటికి పూర్తి చేసింది. గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యను జలవనరుల మంత్రి డి.రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. రూ.60 లక్షల నిధులు విడుదల చేయించడంలో సఫలీకృతులయ్యారు. పనులు పూర్తవ్వడంతో రిజర్వాయర్‌కు ఎగువన ఉన్న సాగర్ నుంచి 2 వేలు క్యూసెక్కుల దాకా నీటిని విడుదల చేస్తున్నారు.

వృథా నీటిని అరికట్టాం

నూతన గేట్లను ఏర్పాటు చేయడం వల్ల వృథా నీటిని అరికట్టామని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు తెలిపారు. రిజర్వాయర్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. మరో రెండు గేట్లను మార్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వీటికి కూడా ప్రతి పాదనలు పంపామన్నారు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, 10 హెచ్‌పీ సామర్థ్యం గల ఆరు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని, విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కొన్ని స్తంభాలు చోరీకి గురైనట్లు వెల్లడించారు. ప్రతి సారి జనరేటర్ మీద గేట్లను ఎత్తడం కష్టసాధ్యంగా మారిన నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. సాగర్ కెనాల్ మీద 901 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా కేవలం 72 మంది మాత్రమే ఉండడం సమస్యకు మరో కారణంగా పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 5 టీఎంసీలకు పెంచడానికి ఇద్దరు ఎమ్మెల్యేలు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. డీసీ చైర్మన్లు పాల్గొన్నారు.



బుగ్గవాగు రిజర్వాయర్‌కు ఏర్పాటు చేసిన గేట్లు

కిట్స్ కళాశాలకు ఎన్‌బీఏ టైర్ - 1 గుర్తింపు

చైర్మన్ కోయ సుబ్బారావు



వట్టిచెరుకూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంపరిధి వింజ నంపాడు గ్రామ సమీపంలోని కిట్స్ కళాశాలకు టైర్ - 1లో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించినట్టు కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు వెల్లడించారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్ర త్యేక సమావేశంలో కోయ సుబ్బా రావు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి బ్రాంచ్‌లకు (సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ) గుర్తింపు లభిం చిందన్నారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి మూడోసారి ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన ఎన్‌బీఏ గుర్తింపు కళాశాలకు లభించిందని, కళా శాల పాటిస్తున్న ప్రమాణాలకు ఈ గుర్తింపు నిదర్శనమన్నారు. దీనిని సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందికి చైర్మన్ సుబ్బారావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కళాశాల కార్యదర్శి కోయ శేఖర్ మాట్లాడుతూ జాతీయ సంస్థలతో తమ కళాశాల పొం దిన ఈ గుర్తింపు తాము అందిస్తున్న అత్యున్నత విద్యా ప్రమాణా లకు నిదర్శనం అన్నారు. క్రమశిక్షణ, పారదర్శకతతో కళాశాల నిర్వ హించటం ద్వారా విజయం సాధ్యమైందని ప్రిన్సిపాల్ పీ బాబు, అకడమిక్ డైరెక్టర్ ఏ హరిబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సైక్లిస్ట్ మృతి

చిలకలూరిపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట-వాడరేవు జాతీయ రహదారిపై పసుమర్రు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని బొందిలిపాలేనికి చెందిన టీకం శ్రీనివాస్ సింగ్(65) అనే వ్యక్తి మృతి చెందాడు. సైకిల్‌పై వెళ్తున్న అ తనిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అక్కడికక్కడే అతడు మృ తి చెందగా.. హైవే సిబ్బంది అందించిన సమాచారం మేరకు చిలక లూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీ లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

యడ్లపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై తిమ్మాపురం బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన దొప్పలపూడి హనుమకోటి(26) కేరళలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. మూడు రోజుల క్రితం అద్దంకికి చెందిన తన స్నేహితుని వివాహం నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. స్నేహితులు చందు, రాజ్‌పుత్ దిలీప్‌కుమార్‌లతో కలసి బుల్లెట్ వాహనంపై అద్దంకిలో రాత్రి జరిగిన తన స్నేహితుని వివాహానికి హాజరయ్యాడు. మరుసటి రోజు ఆదివారం అద్దంకి నుంచి స్వగ్రామానికి బయలు దేరారు. వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ హనుమకోటి మృతిచెందాడు. మృతునికి ఇటీవలే నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. మృతుని తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మించండి: ఎంపీ లావు

న్యూఢిల్లీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని అత్యవసరంగా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో 377 నియమం కింద ఆయన మాట్లాడారు. 'ఈఎస్ఐసీ పథకం ప్రస్తుతం రాష్ట్రంలో 13 లక్షల మంది ఉద్యోగులకు బీమాను అందిస్తోంది. 12 ఈఎస్ఐ ఆస్పత్రులు మాత్రమే క్రియాశీలకంగా పనిచేస్తూ 17 జిల్లాల్లోని కార్మికులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నాయి. వచ్చే ఐదేళ్లలో ఈఎస్ఐసీ పథకం పరిధిలోకి వచ్చే జనాభా అంచనా వృద్ధిని పరిగణనలోకి తీసుకుని నరసరావుపేటలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం తెలపాలి' అని ఎంపీ కోరారు.

ఏఎన్‌యూ డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ కోర్సుల 2వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం తాత్కాలిక వీసీ ఆచార్య కె. గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9,991మంది హాజరు కాగా వారిలో 5,642 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని చెప్పారు. ఈ సందర్భంగా ఏసీఈ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫలితాలకు సంబంధించి రీవాల్యూయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు ఆగస్టు 11వ తేదీలోగా రూ.1,490 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడిలో... రెండు రైళ్లకు నిలుపుదల తొలగింపు

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం రాత్రి వేళ గుంటూరు మీదగా పిడుగురాళ్ల, నడికుడి మీదగా సికింద్రాబాద్‌కు ప్రయాణించే చెన్నై, నారాయణాద్రి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు ఆగస్టు నెల మొదటి వారంలో వివిధ తేదీల నుంచి పైన పేర్కొన్న స్టేషన్లలో నిలుపుదల సదుపాయాన్ని రైల్వే శాఖ తొలగించింది. చెన్నై, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లకు అయితే సత్తెనపల్లి స్టేషన్‌లో కూడా నిలుపుదల తీసేశారు. చెన్నై ఎక్స్‌ప్రెస్ ఆగస్టు మూడో తేదీ నుంచి గుంటూరులో బయలుదేరిన తర్వాత చర్లపల్లి వరకు ఎలాంటి స్టాపేజ్ లేకుండా రైల్వే టైంటేబుల్‌ని సవరించారు. విశాఖ ఎక్స్‌ప్రెస్‌కి అయితే ఈ నెల 5వ తేదీ నుంచి గుంటూరు తర్వాత సికింద్రాబాద్‌లోనే నిలుపుదల కల్పించారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కి మాత్రం సత్తెనపల్లిలో స్టాపేజ్‌ని కొనసాగిస్తూ పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడలో తొలగించారు. దీనిపై ప్రయాణీకులు ఫిర్యాదులు చేయడంతో విషయాన్ని తాము హెడ్‌క్వార్టర్స్‌కు నివేదిస్తామని రైల్వే అధికారులు సమాధానాలు ఇస్తున్నారు.

గంజాయి కేసులో నిందితులకు జైలు

కర్లపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మొదటి తరగతి అదనపు జడ్జి వీ.ఎల్‌ఏ సత్యవతి సోమవారం తీర్పునిచ్చారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండల కేంద్రం పాత చేపల మార్కెట్ సమీపంలో గంజాయి విక్రయిస్తూ 2014లో నిందితులు పట్టుబడ్డారు. దాసరి శ్రీనివాసరావుకు సంవత్సరం జైలు, రూ.10వేలు జరిమానా, గాలం పాపారావుకు నాలుగేళ్ల జైలు, రూ.10వేలు జరిమానా, పోతురాజు అప్పలనాయుడుకు నాలుగేళ్ల జైలు, రూ.10వేల నగదు జరిమానా విధిస్తూ.. జడ్జి తీర్పును వెలువరించారని కర్లపాలెం ఎస్సై రవీంద్ర తెలిపారు. మరో నిందితుడు తోకల పిచ్చయ్య(71) మృతి చెందాడని చెప్పారు. నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న పోలీసు అధికారులను కోర్టువిధులు నిర్వహించే సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

కుడికాల్వకు నీటి విడుదల

(5వ పేజీ తరువాయి)

తెలంగాణ మంత్రులు విడుదల చేయనున్నారు. ముగ్గురు మంత్రులు కార్యక్రమానికి హాజరవుతున్నట్లు సదరు ఇంజనీరు తెలిపారు. సాగర్ డ్యాంకు 1,47,195 క్యూస్కెల వరద ప్రవాహం వస్తోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతలకు నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలతో పాటు సాగర్ నుంచి దిగువకు 42,913 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 585 అడుకులకు చేరుకుంది. ఇంకా ఐదు అడుగులకు చేరితే.. డ్యాం పూర్తిగా నిండుతుంది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా 297 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది.

పులిచింతలకు 25 వేల క్యూసెక్కులు

సాగర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతల జలాశయానికి 25 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం నీట్టి మట్టం 175 అడుగులు కాగా సోమవారం 160.3 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 25.9 టీఎంసీలకు చేరింది. మరో 19.87 టీఎంసీల నీరు వస్తే పులిచింతల నిండుతుంది. మరో మూడు రోజుల్లో పులిచింతల డ్యాం కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారుల అంచనాగా ఉంది. దీంతో ఈ నెలలోనే పులిచింతల గేట్లు తెరచుకోనున్నాయి.

హలో.. మాస్టారూ!

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రీ ఆడిట్ ఫైల్‌ను వివిధ కారణాలతో తిరస్కరించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు లేని నిబంధనలు పెట్టి ఉపాధ్యాయులను ఇక్కట్ల పాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది.

పర్సంటేజ్ ఇవ్వాల్సిందే

ఉపాధ్యాయుల ఇంట్లో శుభకార్యాలు, గృహ నిర్మాణం, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలు తదితర కారణాలతో పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తు చేస్తారు. దరఖాస్తు చేసిన మొత్తాలకు అనుగుణంగా పర్సంటేజ్ ఇవ్వాల్సి వస్తోందని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. రూ.5 లక్షల రుణానికి జడ్పీలో పీఎఫ్ విభాగాల్లో దాదాపు రూ.10 వేలకు పైగా చెల్లించుకోవాల్సి వస్తోందని ఆరోపణలున్నాయి.

ఆరోగ్య సమస్యలున్నా.. వదలడం లేదు

ఉపాధ్యాయులు వివిధ అనారోగ్య సమస్యలతో రుణం కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఇందుకు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ ధృవీకరణ పత్రం రుణ దరఖాస్తుకు జత చేస్తే సరిపోతుంది. అయితే జడ్పీలోనే సిబ్బంది మాత్రం ప్రభుత్వ సివిల్ సర్జన్ సర్టిఫికెట్ మాత్రమే అనుమతిస్తామని ఇది లేకపోతే రుణం మంజూరు చేయమని తిరకాసు పెడుతున్నారు. మరోవైపు కాసులు చెల్లిస్తే మాత్రం అన్నింటికీ ఓకే అని చెబుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధ్యాయులకు నోటీసులు..

ఇటీవల పీఎఫ్ చందాల విషయంలో తేడాలు ఉన్నాయంటూ 55 మంది ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులకు నోటీసులు జారీ అయ్యాయి. ఒక నెలలో ట్రెజరీ నుంచి పీఎఫ్ చందా జమ కాకపోతే ఆ మొత్తం రెండో నెలలో కలిపి జమ చేస్తారు. కొన్ని కారణాల వల్ల ఉపాధ్యాయులు సెలవు లో ఉంటే చందా జీరోగా ఉంటుంది. ఇలాంటి తేడాలను ఆడిట్ సిబ్బంది సరిచే యకుండా నోటీసులు జారీచేయడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నారు.

ఆందోళనకు సిద్ధం..

వివిధ కారణాలతో ఉపాధ్యాయులను విశ్రాంత ఉపాధ్యాయులను జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ సిబ్బంది వేదనకు గురి చేస్తున్నారు. ఈ బాధలు భరించలేక ఇటీవల కొంతమంది జడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదని, ఇక తాము జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని సీఈఓకు స్పష్టం చేశారు. జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ విభాగాల సిబ్బంది ఉపాధ్యాయులను,విశ్రాంత ఉపాధ్యాయులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నారు

సహకారం దొరికేనా!

(5వ పేజీ తరువాయి)

ఉంచడం వల్ల అన్నదాతలకు సమయం కలిసి రావడంతో పాటు రవాణా ఖర్చుల భారం కాకుండా ఉంటాయి. ప్రస్తుతం ఆ సదుపాయం లేకపోవడంతో దగ్గరలోని మండల కేంద్రానికి ఎరువుల కోసం అన్నదాతలు వెళ్లాల్సి వస్తోంది. త్వరలోనే కేటాయింపులు జరుగుతాయని జిల్లా సహకార శాఖ యంత్రాంగం చెబుతోంది.

అవకతవకలు జరిగిన ఖాతాలు గుర్తింపు

రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియ ద్వారా మొత్తం 112 సొసైటీల పరిధిలో 75,400 ఖాతాలు ఆన్‌లైన్ గొడుగు కిందకు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో లావాదేవీల విషయంలో పద్దు టాలీ కాని ఖాతాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా పది ఖాతాల్లో భారీగా నిధులు మళ్లింపు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇవన్నీ కూడా నగరం, తుమ్మల సొసైటీలతో పాటు పంగలూరు మండల పరిధిలోని నూజెళ్లపల్లి సొసైటీల్లో అవకతవకలు జరిగినట్లు తేల్చారు. రూ. 4.50 కోట్ల వరకు గోల్‌మాల్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. భారీగా జరిగినవి ఇలా ఉంటే లక్ష నుంచి మూడు లక్షల వరకు అక్రమాల సొసైటీలు దాదాపు 40 వరకు ఉన్నట్లు సమాచారం. సాంకేతిక చిక్కులతో డిజిటలైజేషన్ చేయడం సాధ్యపడని దాదాపు 28 ఖాతాలకు సంబంధించిన పై అధికారులకు పంపినట్లు యంత్రాంగం చెబుతోంది

అవకతవకల గుర్తింపు సరే...చర్యలేంటి?

గత ఏలుబడిలో భారీగా అక్రమాలు జరిగిన ఖాతాలు గుర్తించారు సరే కాని వారిపై చర్యలేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిధుల రికవరీ దిశగా చర్యలు చేపడతామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు త్రీమెన్ కమిటీలు సొసైటీల పగ్గాలు అందుకోబోతున్నాయి. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత కూడా వీరిపైనే ఉంది. అర్హులైన అన్నదాతలకే సొసైటీల నుంచి రుణాలు అందేలా చూడాల్సి ఉంది

సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు 2014--19 మధ్య ఉన్న టీడీపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ ప్రక్రియ జరుగుతుండగానే ఎన్నికలు రావడంతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఇదే అదనుగా రెగ్యులర్ చేసే విషయంలో ఉద్యోగుల వద్ద నుంచి వైసీపీ నేతలు లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వీటిపై గత ప్రభుత్వంలోనే అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఈ ప్రభుత్వం రాగానే అప్పు డు వచ్చిన ఫిర్యాదులపై శా ఖాపరమైన విచారణకు ఆదే శించినట్లు తెలిపింది. కానీ అదీ ఇంతవరకు అతీగతీ లేదు. వైసీపీ హయాంలో ఎంతమంది ఉద్యోగులను రెగ్యులర్ చేశారనేదానికి ఆయా విభాగాల వద్ద ఇప్పటికీ సరైన సమాధానం లేకపోవడం గమనార్హం. వీటిపై కూడా త్రీమెన్ కమిటీలు దృష్టి పెట్టి ఎవరైతే అర్హత లేకున్నా దొడ్డిదారిన రెగ్యులర్ చేసుకున్నారో అలాంటి వారందరిపై పునర్విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

43,883 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 46,138 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,883 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,671 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నెంబరు. 5	10000	13300
273	----	-----
341	10000	13600
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12400

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9600	11000
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12600
నెంబరు. 5	10000	13400
273	----	----
341	10000	13800
4884	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800
బ్యాడిగి	10000	12400
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	4500	7000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

● ఎస్పీ తుషార్ డూడి ● పీజీఆర్‌ఎస్‌కు 60 అర్జీలు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన 60 మంది తమ సమస్యలను అర్జీల ద్వారా ఎస్పీకి వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ అర్జీలను చట్టపరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీసు కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీసుశాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను పరిష్కరించి మరలా వారు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, ఆర్థికలావాదేవీలు, ఆస్తి తగాదాలు, భూవివాదాలు, ఇతర సమస్యలు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రామాంజనేయులు, చీరాల డీఎస్పీ మోయిన్, రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, పీజీఆర్‌ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేతన్నల జీవన ప్రమాణం మెరుగునకు ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నేతన్నల జీవన ప్రమాణం మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండలంలోని ఐలవరం గ్రామంలో శ్రీభద్రావతి సమేత శ్రీ భావనరుషి పద్మశాలీయ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన సభకు చేనేత జౌళి శాఖ ఏడీఓ పడమట వెంకటరావు అధ్యక్షత వహించారు ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, నేత కార్మికుల షెడ్డులకు ఒక్కొక్కరికి రూ.1.20 లక్షలు అందిస్తుందన్నారు. గతంలో రూ.60 వేలు ఇవ్వడం జరిగిందని, రెండో విడతలో 35 మందికి రూ.21 లక్షల చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. థ్రిఫ్ట్ ఫండ్ కింద 54 మంది రూ.7 లక్షలు అందించినట్లు చెప్పారు. గ్రామానికి చెరుకుపల్లి-భట్టిప్రోలు మెయిన్ రోడ్డుకు పోయే ప్రధాన రహదారి ఏడు సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.50 లక్షలు నిధులను కేటాయించి సిమెంట్ రోడ్డుగా మార్చడం జరిగిందన్నారు. సభలో నేతన్నలకు చెక్కులను పంపిణీ చేశారు. 200 మంది చిన్నారులకు నోటు బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, వేమూరు మార్కెట్ యార్డు చైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, చేనేత శాఖ డివో డి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, జడ్పీటీసీ టి.ఉదయభాస్కరి, మాచర్ల నాగరాజు, డి.శివప్రసాద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చేనేత కార్మికులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



నేతన్నలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లు

● జీవనోపాధికి రూ.65వేలు చొప్పున చేయూత : కలెక్టర్

బాపట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : దత్తత కుటుంబాలలో వెలుగులు నింపేందుకు ముగ్గురు యువకులకు కలెక్టర్ జె.వెంకటమురళి సోమవారం లెర్నింగ్ లైసెన్స్‌లు అందజేశారు. వారి జీనోపాధి కోసం ఒక్కొక్కరికి రూ.65 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. చెరుకుపల్లి మండలం తూర్పుపాలేనికి చెందిన ముగ్గురు యువకులు కోనేటి నరసింహారావు, కోనేటి చింతయ్య, ఉప్పులక్ష్మయ్యలకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో లైసెన్స్‌లు అందజేశారు. పీ4 కార్యక్రమం కింద యువకుల భవిష్యత్తు కోసం కలెక్టర్ బాసటగా నిలిచారు. ప్రభుత్వపాలనలో మానవీయతను ప్రదర్శించిన కలెక్టర్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

కర్లపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి సేవాసమితి సేవా సంస్థలు ఆధ్వర్యంలో సోమవారం పెదగొల్లపాలెం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 98 మంది విద్యార్థులకు జనరల్ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, విటమిన్ టాబ్లెట్స్ ఉచితంగా అందజేసినట్లు సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుభాషిణి, జిల్లా గ్రామ సేవా ఇన్‌చార్జి తుమ్మల శ్రీనివాసరావు, కర్లపాలెం మండల ఇన్‌చార్జి ఎంవీ శివరామరాజు, ఉపాధ్యాయులు నాగరాజు, కర్లపాలెం సమితి, గుడిపూడి భజనమండలి, సేవాదల్ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వాలిన విద్యుత్ స్తంభం... పొంచి ఉన్న ప్రమాదం

బాపట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చెరువు జమ్ములపాలెం రోడ్డులో మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతంలో విద్యుత్ స్తంభం పొలాల్లోకి వాలింది. ఏక్షణాన అయినా స్తంభం నేలవాలే ప్రమాదం ఉంది. కేవలం విద్యుత్ తీగలపై ఆధారపడి ఉన్న స్తంభాన్ని పైకి లేపి నిలబెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవటంలేదు. దీనివల్ల ఆ పక్కనే ఉన్న స్తంభాలు కూడా వొంగుతున్నాయి. వైర్లు తెగి స్తంభాలు నేలవాలితే సరఫరాలో అంతరాయం ఏర్పడటమే కాదు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు సరి చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



బాపట్లలోని జమ్ములపాలెం రోడ్డులో మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతంలో పొలాల్లోకి వాలిన విద్యుత్ స్తంభం

సమస్యలపై స్పందించకుంటే చర్యలు

● అధికారులకు కలెక్టర్ వెంకటమురళి హెచ్చరిక
● అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి
● పీజీఆర్‌ఎస్‌కు 200 అర్జీలు



అర్జీలు తీసుకొని సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలపై స్పందించకుంటే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ జె.వెంకటమురళి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో జిల్లాలోని వివిధప్రాంతాల నుంచి వచ్చిన వారి అర్జీలు తీసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర స్థాయి సర్వేలో బాపట్ల 19వ స్థానంలో ఉండటంపై అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు నుంచి మొత్తం 200 వినతులు అందగా పలు సమస్యలకు కలెక్టర్ సమక్షంలోనే పరిష్కారమార్గం చూపారు. మిగిలిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాబోయే సమీక్షలో జిల్లా స్థానం మెరుగుపడకపోతే నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏ ఒక్క అధికారిని ఉపేక్షించబోమని, చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు

రేపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు అందాయని, పరిశీలించి అర్జీలను పరిష్కరిస్తామని ఆర్డీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ హస్సేన్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. జైభీమ్‌భారత్‌పార్టీతరుపున దోవరమేష్‌రాంజీ పెనుమూడి నుంచి కొల్లూరు వరకు కృష్ణా కరకట్ట రహదారి నిర్మాణంలో ఉన్న అడ్డంకులను తొలగించి అభివృద్ధి చేయాలని కోరారు. భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి చెందిన ఎన్.నాగేశ్వరరావు పెదలంక ఆర్ అండ్ బీ రహదారి పక్కన గల ఆక్రమణను తొలగించాలని కోరారు. బేతపూడి శివారు వుయ్యూరుపాలెం గ్రామప్రజలు పంట కాల్వలో పూడిక తీయించాలని కోరుతూ అర్జీ దాఖలు చేశారన్నారు. పట్టణానికి చెందిన చెరుకూరు సాంబోస్ తన ఇంటి స్థలం పక్కన చికెన్‌షాపు ఉందని, దాని నుంచి వచ్చే వ్యర్థపదార్థాల వలన అనారోగ్యం వస్తుందని, షాపును తొలగించాలన్నారు. వెల్లటూరు గ్రామానికి చెందిన సైకం వెంకటసుబ్బారావు గ్రామంలో చేతిపంపులు పని చేయటం లేదని, వాటికి మరమ్మతులు నిర్వహించాలని కోరారు.

బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలును అధికారులు వేగవంతం చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలుపై అధికారులు, బయర్లతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ నిర్వహించారు. బ్లాక్ బర్లీ పొగాకు ప్రతి రోజు 325 మంది రైతుల నుంచి 650 టన్నులు తగ్గకుండా కొనుగోలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. గడిచిన వారంలో 1,765 టన్నుల బర్లీ పొగాకు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు ప్రస్తుతం జిల్లాలో 13 పొగాకు కొనుగోలు కేంద్రాలు నడుస్తున్నాయన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు పంటను సాగు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం 24 కంపెనీల పొగాకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో ఐటీసీ కంపెనీ 3,835 మెట్రిక్ టన్నులు పొగాకును కొనుగోలు చేసిందన్నారు. పీటీసీ కంపెనీ 1,700 మెట్రిక్ టన్నులు, ఆలయన్స్ కంపెనీ ఒకవెయ్యి మెట్రిక్ టన్నులు, విఎస్‌టి కంపెనీ 900 మెట్రిక్ టన్నులు, మిగిలిన కంపెనీలన్ని కలిసి మొత్తం 32 వేల మెట్రిక్ టన్నుల పొగాకును రైతుల నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినట్లు వివరించారు ప్రభుత్వం కొనుగోలు చేసిన పొగాకును 4.40 లక్షలు మెట్రిక్ టన్నుల వరకు నిల్వ చేయటానికి అన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారని తెలిపారు. మరో 2.0 లక్షల మెట్రిక్ టన్నులు పొగాకును నిల్వ చేయడానికి పొరుగు జిల్లాలలో గోదాములను పరిశీలిస్తున్నామన్నారు. పొగాకు కొనుగోలు ప్రక్రియ రెండు నెలలు గడువు ఇవ్వాలని కంపెనీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తెచ్చారని అన్నారు. ఆగస్టు 31వ తేదీ వరకు 2,500 మంది రైతుల నుంచి కొనుగోలు చేయడానికి షెడ్యూల్ ఇచ్చామన్నారు. జిల్లాలో 13,777 మంది రైతులు పేర్లను యాప్‌లో నిక్షిప్తం చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ డిఆర్‌వో జి.గంగాధర్ మార్క్‌ఫెడ్, డీఎం కరుణశ్రీ, ఎస్‌డీసీ లవన్న, పొగాకు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

సంపూర్ణ ఆరోగ్యంతోనే చక్కని జీవితం : కలెక్టర్

● టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్‌లు పంపిణీ

బాపట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేయాలని, సంపూర్ణ ఆరోగ్యంతోనే చక్కగా జీవించవచ్చు అని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో భాగమైన జిల్లా క్షయవ్యాధి నివారణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు 11 రకాల పౌష్టికాహార పదార్థాలతో కూడిన కిట్‌లను సోమవారం కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1056 మంది టీబీ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని వారందరికి కలెక్టర్ రిలీఫ్‌ఫండ్ నుంచి 2 నెలలకు సరిపోవు పౌష్టికాహార కిట్‌లు నెలకు ఒకటి చొప్పున అందించనున్నట్లు తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.700, 6 నెలలకు రూ.4,200 విలువ చేసే పౌష్టికాహార కిట్‌లు అందజేసి ఎన్జీవోలు, మహిళా సంఘాలు నిక్షయ మిత్రలుగా చేరి దత్తత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా లెప్రసి, టీబీ ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ షేక్ మహ్మద్ సాధిక్, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థిక చేయూత



బియ్యం అందజేస్తున్న శివాజీరాజు, రామ్మోహనరావు

కర్లపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీచత్రపతి శివాజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం లైబ్రరి వెనుక నివసిస్తున్న ఒక నిరుపేద వృద్ధురాలికి 10 కిలోల బియ్యం ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజీరాజు, తూనుగుంట్ల రామ్మోహనరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూనం కృష్ణ, డాక్టర్ హనుమంతరావు నాయుడు, చాపల సుబ్రహ్మణ్యం, మంతెన రామరాజు, మంతెన సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయవర్గాన్ని పీ-4కు దూరంగా ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీరామ్

వేమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఉపాధ్యాయులను పీ-4కు దూరంగా ఉంచాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎం.శ్రీరామ్ కోరారు. ఆయన సోమవారం వేమూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఉపాధ్యాయులపై పీ-4 భారం మోపడం అశాస్త్రీయమని, అన్యాయమని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులను సంపన్నవర్గంగా ప్రభుత్వం భావించడం దురదృష్టకరమన్నారు. బీపీఎల్ కుటుంబాలు పేదరికం పోయే వరకు సాధికారత సాధించే వరకు ఆర్థిక సహకారంతో పాటు పిల్లల విద్యాఫీజులు, ఇతరత్రా బాధ్యత ఇవ్వడంపై ఉపాధ్యాయులు తీవ్ర అసహనానికి గురవుతున్నారన్నారు.

పీజీఆర్‌ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

● తహసీల్దార్ షాకీర పాషా

కర్లపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షాకీర పాషా అన్నారు. సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యాజలిలో గడ్డి వామి దగ్ధం



యాజలిలో దగ్ధమవుతున్న గడ్డివామి

కర్లపాలెం,జూలై 28 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని యాజలి గ్రామంలో ప్రమాదవశాత్తు మంటలు ఎగసి 15 ఎకరాల గడ్డివాములు సోమవారం దగ్ధమయ్యాయి. నాదెండ్ల సత్యానందంకు చెందిన 10 ఎకరాల వరిగడ్డివామి, బులిమెర వసంతరావుకు చెందిన 5 ఎకరాల గడ్డివామి దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్థుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

బగళాముఖి అమ్మవారి దీక్షలు ప్రారంభం

పిట్టలవానిపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో 11 మంది భక్తులు అర్ధమండలి దీక్షను చేపట్టారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం శ్రావణ మాసంలో అమ్మవారి దీక్షలు, మాలలు, వస్త్రాలు దేవస్థానం తరుపున దీక్షాపరులకు ఉచితంగా అందజేయటం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు దేవస్థానంలో తమ వివరాలు నమోదు చేసుకొని శ్రీబగళాముఖి అమ్మవారి దీక్షలు స్వీకరించవచ్చునని ఆయన తెలిపారు.



శ్రీబగళాముఖి అమ్మవారి దీక్షలు చేపట్టిన భక్తులు

రోడ్డు వేయరు... పిచ్చిమొక్కలు తొలిగించరు

● అధ్వానంగా విద్యానగర్ రహదారి
● పట్టించుకోని అధికారులు

బాపట్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో విస్తరించిన రోడ్లను అభివృద్ధి పర్చకుండా వదిలేశారు. రోడ్లపై మొలిచిన పిచ్చిమొక్కలు, జిల్లేడు చెట్లు పెరిగిపోతున్నప్పటికి కనీసం వాటిని కూడా తొలిగించటం లేదు. పారిశుధ్యం నిర్వహణలో ప్రథమస్థానంలో వచ్చినట్లు చెప్పుకుంటున్న అధికారులు, ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రోడ్లను మాత్రం శుభ్రం చేయటంలో విఫలమౌతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా కర్లపాలెం రోడ్డులోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా విద్యానగర్ రోడ్డును హైవే బైపాస్ వరకు విస్తరించి మధ్యలో డివైడర్ నిర్మించారు. పక్కనే మురుగుకాల్వలు నిర్మించారు. గత ప్రభుత్వంలో రోడ్డుపై మెటల్ వేసి వదిలేశారు. బీటీరోడ్డుగా అభివృద్ధి చేయలేదు. ప్రస్తుతం డివైడర్‌లో, రోడ్డుపై ముళ్ళచెట్లు, జిల్లెడు మొక్కలు, పిచ్చిమొక్కలు పెరిగి విస్తరిస్తున్నాయి. రోడ్డును అభివృద్ధి చేయకపోయినా కనీసం పిచ్చిమొక్కలు తొలిగించి శుభ్రం చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా డ్రైనేజిలో మురుగు ముందుకు ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలంటున్నారు. బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు నివాసానికి వెళ్ళే ఈ రోడ్డు ఇంత అధ్వానంగా ఉండటంపై ఆ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు. పైగా రోడ్డు పక్కనే మొక్కలు నాటేందుకు గుంతను తవ్వి అందులో మొక్కలు పెట్టి గుంతలు పూడ్చకుండా వదిలేశారనే విమర్శలు కూడా ఉన్నాయి. అధికారులు దీనిపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విద్యానగర్‌లో విస్తరించిన రోడ్డుపై పెరిగిన జిల్లేడు మొక్కలు, డివైడర్‌లో పిచ్చిచెట్లు



లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

నలుగురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

చుండూరు (వేమూరు), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెండు గ్రామాలకు చెందిన నలుగురు లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. పెనుగుదురుపాడుకు చెందిన యలవర్తి రవికిషోర్‌కు రూ.32,500, అడపా శ్రీనివాసరావుకు రూ.22 వేలు, పాలపర్తి సుజాతకు రూ.20 వేలు, చినగాదెలవర్రుకు చెందిన మిండాల సీతారామయ్యకు రూ.27,341ల చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయాన్ని కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి మంజూరు చేయించి లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబుకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ షాపుల పని తీరుపై నిఘా అవసరం : తహసీల్దార్

వేమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని రేషన్ షాపుల్లో పని తీరుపై వీఆర్వోలు నిఘా అవసరమని తహసీల్దార్ సుశీల అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు అర్జీలు అందగా, వాటిలో ఇద్దరు రేషన్ కార్డుల మంజూరు నిమిత్తంగా మరో వ్యక్తి భూమి సర్వే కోసం అర్జీలు దాఖలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి వీఆర్వో ప్రజలకు అందుబాటులో ఉండాలని బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ పంపిణీ జరిగే విధంగా ప్రత్యేక పర్యవేక్షణతో ఉండాలన్నారు. భూమి శిస్తు వసూలు చేయాలన్నారు. అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులకు వారి సర్వే నెంబరు బ్యాంకు అకౌంట్, ఆధార్ లింకు అయినది, లేనిది పరిశీలించి వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా జాబితాలో పేర్లు లేని రైతులకు పథకం వర్తించే విధంగా సహకరించాలన్నారు. బీఎల్‌వోల సహకారంతో ఓటర్ల నుంచి అందుకున్న అర్జీలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు.



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుశీల

ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌తో ఎంపీడీవో సమావేశం

చెరుకుపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌తో ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు సోమవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని లింక్ రోడ్లులకి సంబంధించిన సర్వే ఈ వారంలో పూర్తి చేయాలని, అలాగే అన్ని గ్రామాల్లోని ఎస్టీలకు కూడా హౌసింగ్ సర్వే గురువారంలోపు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ ఆదేశించారు. ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని గ్రామాల్లో శానిటేషన్, షెడ్ల పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కావున గ్రామాల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ టెస్టింగ్ నిర్వహించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు

ఆన్‌లైన్ విధానం ద్వారా ఇంటి పన్ను వసూలు

● ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్

వేమూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ఇంటి పన్నుల వసూలు విధానాన్ని ఆన్‌లైన్ ద్వారా అమలు చేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన ఇంటి పన్నుల జాబితాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. వాటి ఆధారంగా 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే ఇంటి పన్నులు వసూలు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ సూచనలను కార్యదర్శులు పాటించాలన్నారు. గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ కులాలలో అర్హత ఉండి ఉపాధి హామీ పనులకు సంబంధించిన జాబ్‌కార్డులు పొందని వ్యక్తులను గుర్తించి వారికి వెంటనే కార్డులు మంజూరు చేయించాల్సి ఉందన్నారు. బంగారు కుటుంబాలను గుర్తించడానికి ప్రభుత్వ నిబంధనలను అవగాహన చేసుకుని అర్హులను గుర్తించాలన్నారు. సమావేశంలో 14 సచివాలయాల కార్యదర్శులు, పంచాయతీల కార్యదర్శులు హాజరయ్యారు.



కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్

అంగన్‌వాడీలకు కూరగాయల విత్తనాలు పంపిణీ

రేపల్లె, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రంలో బాలలకు పటిష్టమైన ఆకుకూరలు అందించేందుకు ఈ తోటలు దోహదపడతాయని చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ట్రస్టు మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చోడాయపాలెం, బొబ్బర్లంక, పెనుమూడి, విశేశ్వరం, పిరాట్లంక, తుమ్మల, కారుమూరు, నల్లూరుపాలెం గ్రామాల్లో అంగన్‌వాడీ వర్కర్లకు సోమవారం 14 రకాల కూరగాయల విత్తనాలను అందించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో విత్తనాలు చిమ్మి ఆరోగ్యవంతమైన కూరగాయలను పిల్లలకు అందించాలని ఆయన కోరారు.



కూరగాయల విత్తనాలను అందిస్తున్న చైల్డ్ రైట్స్ ఫౌండేషన్ ట్రస్టు సభ్యులు




ప్రకృతి వ్యవసాయ శిక్షణా శిబిరంలో పాల్గొన్న కేరళ బృందం, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్

కేరళ బృందం ఫిదా..!

● ఏపీ రైతుల ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు ప్రశంసలు

గుంటూరు సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'ప్రకృతి వ్యవసాయానికి ప్రాణాధారం జీవవైవిధ్యం. 365 రోజుల పాటు పొలాన్ని పంటలతో కప్పి ఉంచడంలో.. రైతులే అత్యుత్తమ ఆవిష్కర్తలు, శిక్షకులు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ నమూనాలను ఊహించిన దానికంటే ఉత్తమంగా రైతులు ముందుకు తీసుకువెళ్తున్నారు.' అని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ పేర్కొన్నారు. కేరళ ప్రతినిధి బృందం మూడో రోజు శిక్షణలో భాగంగా గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సిఫార్సు చేసిన పద్ధతులను మించి, కొత్త ఆవిష్కరణలు చేయడం ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. ప్రకృతి వ్యవసాయం ఒక సుస్థిర, వ్యాప్తి చెందగల రైతు ఆధారిత ఉద్యమంగా మారిందని కేరళ బృందం సభ్యులు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రైతులు ప్రదర్శించిన వినూత్న పద్ధతులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పంటల వైవిధ్యం, నేల ఆరోగ్య నిర్వహణ, జీవ ఉత్ప్రేరక తయారీ వంటి అంశాలు వారిని ఆకట్టుకున్నాయి. రైతులు ప్రకృతి వ్యవసాయం సూత్రాలను అనుసరించడమే కాకుండా వాటిని మెరుగుపరుస్తూ ముందుకెళ్తున్నారని వారు పేర్కొన్నారు. సీనియర్ సలహాదారు డాక్టర్ వరప్రసాద్ ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేసి, ఏపీలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శాస్త్రీయ అధ్యయనాలు, ఆధారాలను వివరించారు. సీనియర్ కన్సల్టెంట్ మహేశ్వరి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం బహుముఖ దృష్టి కోణాన్ని కలిగి ఉందని, నేల నిర్మాణాన్ని బలపరుస్తుందన్నారు. సీనియర్ కన్సల్టెంట్ లక్ష్మీదుర్గా (వర్చువల్‌గా) మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా పోషక భద్రత సాధ్యమవుతుందన్నారు. పాఠశాలలు, అంగన్వాడీలకు రసాయన రహిత ఉత్పత్తులను అందించడం, ఆహార వైవిధ్యం పెంచడం ద్వారా పోషకాహార లోపాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. రైతు సాధికార సంస్థ సిబ్బంది డాక్టర్ డీవీ రాయుడు, జేబీఆర్ చక్రవర్తి, గోపీచంద్, వి.కృష్ణారావు సమావేశంలో బృందానికి తోడ్పడ్డారు.

ప్రయాణికుల జాగారం

● స్పెషల్ ట్రైన్స్ రాక గంటల తరబడి నిరీక్షణ

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల - వినుకొండ మధ్యన ఉన్న నెమలిపురి, రొంపిచర్ల రైల్వేస్టేషన్లలో ప్రయాణీకులు రాత్రి అంతా జాగారం చేయాల్సి వస్తోన్నది. నంబరు. 07189 నాందేడ్ - తిరుపతి రైలుని నడికుడి - శ్రీకాళహస్తి మార్గంలో పూర్తి అయిన వినుకొండ సెక్షన్‌లో ప్రవేశ పెట్టారు. ఈ రైలు ప్రతీ శుక్రవారం అర్ధరాత్రి 1 గంటకు నెమలిపురి రావాలి. అయితే ఇది తెల్లవారజామున 4 గంటలు దాటిన తర్వాతనే వస్తున్నది. ఈ కారణంగా తిరుపతి వెళ్లేందుకు టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్న ప్రయాణీకులు రాత్రి అంతా మేల్కొని స్టేషన్‌లో ఎదురు చూడాల్సి వస్తున్నది. ఈ రైలు తిరుపతికి మధ్యాహ్నం 12.30కి చేరుకొని 2.20 కల్లా శనివారం తిరుగు ప్రయాణం కావాలి. తిరుపతికి వెళ్లడమే రెండు గంటలకు పైగా ఆలస్యం అవుతుండటంతో ప్లాట్‌ఫాం మీదనే క్లీనింగ్ చేసి లోకో రివర్స్ చేస్తున్నారు. ఈ కారణంగా తిరుగు ప్రయాణమయ్యే రైలు నంబరు. 07190 తిరుపతి - నాందేడ్ స్పెషల్ రీషెడ్యూల్ చేయాల్సి వస్తున్నది. షెడ్యూల్ ప్రకారం ఈ రైలు రొంపిచర్లకు రాత్రి 10.25కు చేరుకోవాలి. రీషెడ్యూల్ కారణంగా అర్ధరాత్రి దాటాక 3.30కి వస్తున్నది. దాంతో నెమలిపురికి వెళ్లేసరికి మరో పావు గంటకు పైగా సమయం పడుతున్నది. ఈ నేపథ్యంలో ఆపరేటింగ్ అధికారులు షెడ్యూల్ ప్రకారం ఈ స్పెషల్ ట్రైన్‌ని నడిపేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

పిచికారీ.. ప్రమాదం లేకుండా



● పురుగుమందు చల్లేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
● ఊపిరితిత్తులు, క్యాన్సర్ బారిన పడే ప్రమాదం
● ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో కలుపుమందులు వినియోగం

తెనాలిరూరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు ప్రారంభ సమయం కావడంతో పంటలసాగుకు భూములను శుభ్రం చేసే పనిలో రైతులు హడావిడిగా ఉన్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు తెరిపివ్వడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తెనాలి మండలంలో 18వేల ఎకరాల్లో వెద సాగుపనులు జరుగుతున్నారు. చేలు చుట్టూ ఉన్న గట్లు శుభ్రం చేసుకుని పంటపొలాల్లో ఉన్న గడ్డిజాతి మొక్కలను ఏరివేసే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో కూలీలతో చేయించే ఈ పనులను సాగుకు ఖర్చు భారంగా మారుతుందన్న ఉద్దేశంతో అధిక సంఖ్యలో కలుపు నివారణ మందుల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ఈ రసాయనాలు ప్రమాదకరమన్న విషయాన్ని మరిచి వీటిని పిచికారి చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్యసమస్యల బారిన పడే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఏటా కలుపు నివారణ, పురుగు మందులు పిచికారి చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అనేక అనారోగ్య సమస్యల బారినపడి మృతి చెందుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య శాఖ సైతం జరిపిన సర్వేలో వెల్లడైంది.



రసాయన ద్రావణం ప్రమాదకరం - డాక్టర్ శ్రీకాంత్



పంటపొలాలకు వినియోగించే కలుపు నివారణ, పురుగు నివారణ మందులు అత్యంత ప్రమాదకరమని జిల్లా ప్రభుత్వవైద్యశాల ఎండీ డాక్టర్ శ్రీకాంత్ చెబుతున్నారు. పంటపొలాల్లో పిచికారి చేసే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాల మీదకు వస్తుందని చెబుతున్నారు. తక్కువ మోతాదులో పీల్చుకునే మందు వల్ల కాలక్రమేణా అనారోగ్య సమస్యలు తలెత్తుతూ క్యాన్సర్, ఇతర అవయవాలపై ప్రభావం చూపుతున్నాయన్నారు. మందును బట్టి కేవలం 100 - 200 ఎంఎల్ అతి తక్కువ మోతాదులోనే ఒంట్లోకి ప్రవేశిస్తే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుందన్నారు.

రసాయనాలు కలిపే సమయంలో తప్పనిసరిగా గ్లౌజులు ధరించాలి


కలుపు లేదా పురుగు మందుల రసాయన ద్రావణాన్ని కలిపే సమయంలో తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు ధరించాలి. రసాయనం కలపడం పూర్తి అయ్యేంత వరకూ ఎట్టిపరిస్థితుల్లో తినుబండారాలు తినకూడదు. ధూమపానం కూడా చేయకూడదు. గ్లౌజులు తీసిన తరువాత సబ్బుతో శుభ్రంగా కడుకోవ్వాలి

పిచికారి చేసే సమయంలో..

పురుగు, గడ్డి మందుల రసాయన ద్రావణాన్ని పిచికారి చేసే క్రమంలో తలకు టోపి, ముక్కుకు, నోటికి మాస్కు, కళ్లజోడు ధరించాలి. శరీరం మొత్తం కప్పి ఉంచేలా దుస్తులు కానీ, సేఫ్టీ కిట్లు వినియోగించడం అత్యుత్తమం.

సంతానోత్పత్తి కేంద్రాలను.. తనిఖీ చేయండి

● లోపాలుంటే సమగ్ర నివేదిక అందజేయండి
● వైద్య ఆరోగ్య శాఖకు ప్రభుత్వ ఆదేశాలు



గుంటూరు మెడికల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సంతానోత్పత్తి కేంద్రాలను తనిఖీ చేసి వాటిలో లోపాలు ఉంటే వెంటనే సమగ్ర నివేదిక అందజేయాలని సోమవారం ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించింది. ఇటీవల విజయవాడ, హైదరాబాద్ కేంద్రాలుగా సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ సరోగసీ పేరిట అక్రమాలకు పాల్పడినట్లు తేలిన నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంతానోత్పత్తి సెంటర్లను తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందజేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. సంతానోత్పత్తి సేవలందిస్తున్న ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వహణకు జిల్లా స్థాయిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేస్తారు. అనంతరం నిర్వహణ నియమాల మేరకు పనిచేసే విషయాన్ని కూడా డీఎమ్‌హెచ్‌ఓలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. నియమాలను ఉల్లంఘించే ఆసుపత్రులపై తగిన చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అధికారిక సమాచారం మేరకు రాష్ట్రంలో పనిచేస్తున్న సంతానోత్పత్తి కేంద్రాల సంఖ్య, గూగుల్ ద్వారా వెదికినపుడు వచ్చిన ఫెర్టిలిటీ సెంరట్లకు సంఖ్యలో చాలా వ్యత్యాసమున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో... రాష్ట్రంలో డీఎంహెచ్ఓ కార్యాలయం జిల్లాలో మొత్తం ఎన్ని ఐవీఎఫ్/సరోగసీ కేంద్రాలకు అనుమతులిచ్చారు? అనుమతులు లేకుండా ఎన్ని పనిచేస్తున్నాయి? 2024-25 సంవత్సరంలో జిల్లాలో ఎన్ని కేంద్రాలను పరిశీలించారు? లైసెన్స్ లేకుండా పని చేస్తున్న కేంద్రాలు ఎన్ని తేలాయి? ఆయా ఫెర్టిలిటీ సెంటర్ల పనితీరుపై ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు? ఎన్ని కేంద్రాలకు అనుమతులు నిరాకరించారు? నియమాలమేరకు ఈ ఫెర్టిలిటీ సెంటర్లు పని చేసేలా చూడటానికి ఎటువంటి చర్యలు చేపట్టారు? అనే అంశంపై సమగ్ర నివేదికను అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు

గతంలో గుంటూరులోనూ అవకతవకలు...

సరోగసీ పేరిట దంపతులను మోసం చేసి ప్రస్తుతం జైలు ఊచలు లెక్కబెడుతున్న గైనకాలజిస్ట్ డాక్టర్ నమ్రత, గతంలో గుంటూరులోని కొత్తపేటలో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వహించి మోసాలకు పాల్పడ్డారు. అప్పట్లో సంతానం కోసం వచ్చిన దంపతులకు మగ పిల్లాడిని మాత్రమే పుట్టించే అమెరికన్ టెక్నిక్ తమ దగ్గర ఉందని డాక్టర్ నమ్రత నమ్మబలికించి వారి నుంచి రూ.లక్షలు కాజేశారు. అయితే ఐవీఎఫ్ చికిత్సల్లో రెండు సార్లు ఆ దంపతులకు ఆడ బిడ్డ జన్మించడంతో దంపతులు, అప్పటి డీఎంహెచ్‌వో డాక్టర్ గోపీనాయక్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు జరిపిన విచారణలో డాక్టర్ నమ్రత వారిని మోసం చేసినట్లు తేలడంతో డీఎంహెచ్‌వో గోపీనాయక్, సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను సీజ్ చేశారు. ఆమె తప్పించుకొని విజయవాడ వెళ్లిపోయారు. అప్పటి నుంచి సదరు డాక్టర్ తన పద్ధతి మార్చుకోలేదని తాజా సంఘటన చెబుతోంది.

విజయవాడలో మరో సెంటర్ ఆమెదే!

ఇది ఇలా ఉంటే సోమవారం ఎన్‌టీఆర్ జిల్లా డీఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ సుహాసిని, విజయవాడలో పనిచేస్తున్న యూనివర్సల్ హెల్త్ కేర్ సెంటర్ పై తమ బృందంతో కలసి తనిఖీకి వెళ్లగా ఆ కేంద్రం మూసి ఉన్నట్లు ఆమె మంత్రి కార్యాలయానికి తెలిపారు. అక్రమాల ఆరోపణలతో అరెస్ట్ అయిన డాక్టర్ నమ్రత పేరిటనే యూనివర్సల్ ఫెర్టిలిటి సెంటర్ మంజూరు అయిందని ఆమె వెల్లడించారు. తనిఖీ సమయానికి ఈ సెంటర్ సిబ్బంది ఎవరు లేకుండా మూసి ఉండటం అనుమానాలకు దారి తీస్తోందని, ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి తగు చర్యలు చేపడతామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని తెలిపారు.

ఉచిత ప్రయాణంపై కసరత్తు



● ప్రణాళికలు సిద్ధం చేస్తోన్న ఆర్టీసీ యంత్రాంగం
● రేపు గుంటూరులో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు సమావేశం
● మహిళలకు ఉచిత ప్రయాణంపై దిశా నిర్దేశం

గుంటూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఆర్టీసీ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సర్వీసులు, మహిళా ప్రయాణీకుల వివరాలు వంటి వివిధ అంశాలపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులకు దిశానిర్దేశం చేసేందుకు ఆర్టీసీ మేనేజింగ్ డైరక్టర్ సీహెచ్ ద్వారకా తిరులమరావు ఈనెల 30న గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ పర్యటనకు వస్తున్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ పర్యటన షెడ్యూల్‌ను జిల్లా అధికారులకు తెలియజేశారు. ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో)గా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ విమల ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్ళటంతో ఆమె స్థానంలో గుంటూరు ఇన్‌చార్జ్ డీపీటీవోగా బాపట్ల డీపీటీవో సామ్రాజ్యం ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. కాగా నెల్లూరు జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్ అధ్వర్యంలో పల్నాడు డీపీటీవో అజితకుమారితో పాటు డిపోల మేనేజర్లతో ఎండీ తిరుమలరావు సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధానంగా ప్రభుత్వం ఆగస్టు 15నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలన్న పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. దాంతో ముందుగా సన్నాహాలు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్ని సర్వీసులు ఉన్నాయి. రోజువారీ ప్రయాణీకుల సంఖ్య ఎంత, ఇందులో మహిళా ప్రయాణీకుల సంఖ్య ఎంత శాతం ఉంది, ఎన్ని కిలోమీటర్లు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయనే అంశాలపై అధికారులు గణాంకాలు తీస్తున్నారు. మరోవైపు ఉచిత ప్రయాణం అమలుచేస్తే మహిళా ప్రయాణీకుల సంఖ్య 20నుంచి 30శాతం వరకైనా పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా గణాంకాలతో అధికారులు సమీక్షకి రావాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

ఉచిత ప్రయాణంపై అధికారుల్లో ఆందోళన....

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలుపై అధికారుల్లో కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు వెయ్యి వరకు సర్వీసులు ఉన్నాయని, అందులో అత్యధికశాతం డొక్కు బస్సులు ఉన్నాయని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాదిలో పది శాతం వరకు డొక్కు బస్సులను తొలగించారని, మిగిలిన బస్సులతో నెట్టుకొస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంపై ఏ విధంగా అమలు చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు. మరో వైపు ఉచిత ప్రయాణంపై ఇప్పటికే ఐదు కేటగిరీల బస్సులకు అందజేయనున్నట్లు ప్రభుత్వ పెద్దల నుంచి ప్రకటనలు వినిపిస్తున్నాయి. అయితే ఆయా కేటగిరీలపై స్పష్టత రావాల్సి ఉందని చెబుతున్నారు. ప్రస్తుతమున్న సర్వీసులకు అదనపు సర్వీసులు అవసరం తప్పదని, అందుకు అనుగుణంగా సిబ్బంది కూడా కావాల్సి ఉందని ఉద్యోగ సంఘాల నుంచి ఇప్పటికే పలు విజ్ఞాపనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఎండీ అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు.

దుగ్గిరాల రైల్వే స్టేషన్‌కు నూతన హంగులు



దుగ్గిరాల స్టేషన్ ఆవరణలో నిర్మించిన ప్రయాణికుల బ్రిడ్జి



సర్వాంగ సుందరంగా ముస్తాబైన దుగ్గిరాల రైల్వేస్టేషన్

● నేటి నుంచి కొత్త భవనంలో టిక్కెట్ బుకింగ్
● నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సిగ్నలింగ్ వ్యవస్థ

దుగ్గిరాల, జూలై 28(ఆంధ్రజ్యోతి): పసుపునకు ప్రఖ్యాతిగాంచిన దుగ్గిరాలలోని రైల్వేస్టేషన్ ఆధునికీకరణతో సర్వాంగ సుందరంగా మారింది. మంగళవారం నుంచి నూతనంగా నిర్మించిన బుకింగ్ కేంద్రం ద్వారానే ప్రయాణికులకు టిక్కెట్లు ఇవ్వనున్నట్లు రైల్వేస్టేషన్ అధికారులు చెబుతున్నారు. 322 కిలోమీటర్లమేర నిర్మాణం పూర్తిచేసుకున్న మూడవ లైన్ నిర్మాణ అనంతరం.. 137 ఏళ్ల క్రితం 1888లో నిర్మించిన దుగ్గిరాల రైల్వేస్టేషన్ పాతభవనం తొలగించాల్సివచ్చింది. ఇప్పటికే మూడోలైన్‌పై పలుమార్లు ట్రైల్‌రన్ నిర్వహించారు. సిగ్నల్ వ్యవస్థ, క్యాబిన్ నిర్మాణంతోపాటు కొత్తగా ఇతర ప్లాట్ ఫాంలకు వెళ్లేందుకు అదనపు బ్రిడ్జి కూడా నిర్మించారు. తెనాలివైపు మూడోలైన్ కోసం రైల్వేబ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టారు. దుగ్గిరాల రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం వందల రైళ్లు వెళ్తుంటాయి. గతంలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు పసుపు పంట తరలించేందుకు దుగ్గిరాల వాణిజ్య కేంద్రంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యేక లూప్‌లైన్ గూడ్స్‌షెడ్ కూడా ఉండేది. కాలక్రమేణా ఎగుమతులు తగ్గుముఖం పట్టడం, లారీల ద్వారా రవాణా చేయడం ప్రారంభించారు. గతంలో తిరుమల, హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్లు దుగ్గిరాల స్టేషన్‌లో ఆగేవి. ప్రస్తుతం ప్యాసింజరు రైళ్లు, ఒక్క కృష్ణాఎక్స్‌ప్రెస్‌కు మాత్రమే ఇక్కడ హాల్టింగ్ ఉంది. భవిష్యత్తులోనైనా.. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపే అవకాశం ఉంటుందేమోనని పరిసర గ్రామాల ప్రయాణికులు ఎదురు చూస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు భారీ గుంతలతో అధ్వానంగా మారింది. రోడ్డు నిర్మాణం కూడా చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



దుగ్గిరాల స్టేషన్ సూపరింటెండెంట్ ఆధీనంలో ఉండే అత్యాధునిక సిగ్నల్ వ్యవస్థ



దుగ్గిరాల రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్

అప్పుడు నిషేధం.. ఇప్పుడు నివాసం

● రాళ్లగుట్టలు బ్రిటీష్ జమానాలో 22ఏలో చేరిక
● దాచేపల్లిలో ఇప్పుడు అవే నివాస ప్రాంతాలు
● హక్కులు పొందలేకపోతున్న గృహ యజమానులు
● రూ.లక్షల పన్ను ఆదాయం కోల్పోతున్న నగర పంచాయతీ

దాచేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష కాలం నాటి చట్టాలు నేటికి అమలు కావడం ప్రజలను ఇబ్బంది పెడుతోంది. భూమి నైతిక స్వరూపం, రాళ్ల గుట్ట, పోరంబోకు, వాగు, వంక, డొంక, అటవీ భూమి ఇవన్నీ కూడా 1920లో ఆర్ఎస్ఆర్(రీసర్వే రిజిస్టర్)లో ఏ విధంగా నిర్ణయించారో అదే పరిస్థితి నేటికి కూడా అమలువుతోంది. ఒకప్పుడు రాళ్ల గుట్టగా ఉన్న స్థలాలు నేడు నగర పంచాయతీలో అత్యంత విలువైన, ప్రధానమైన ప్రాంతంగా మారింది. ఉదాహరణ నగర పంచాయతీలోని 62/2ఏ, 66/2ఏ/5, 66/2బీ, 158/13, 14, 15, 16, 17, 18, 19, 20, 995/19, 20, 21డీ ఈ సర్వే నంబర్ల భూములు 22ఏ లిస్టులో ఉన్నాయి. ఇవన్నీ కూడా ఎంతో అభివృద్ధి చెంది ఉద్యోగులు, వ్యాపారులు, వ్యవసాయ కూలీలు అధికంగా నివాసం ఉంటున్న ప్రాంతాలు. వందేళ్ల క్రితం తయారు చేసిన రికార్డులు ఏం చెబుతున్నాయో.. ఇప్పటికీ కూడా అవే చట్టాలు అమలు కావడంతో ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ, ఇన్నీ కావు. దాచేపల్లి.. గ్రామ స్థాయి నుంచి నగర పంచాయతీగా అభివృద్ధి చెందింది. తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దు మండలంగా ఉండటంతో ఆంధ్రాకు ముఖద్వారంగా మారింది. సున్నపు రాయి గనులు విస్తారంగా ఉండటంతో చిప్స్ అండ్ పల్వరైజింగ్, కెమికల్ ఫ్యాక్టరీలు, సిమెంట్ పరిశ్రమలు విస్తారంగా ఉన్నాయి. దీంతో కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడ్డాయి. ఆస్పత్రులు ప్రభుత్వ కళాశాలలు దాచేపల్లిలో ఏర్పాటయ్యాయి. విద్యా, వైద్య, రవాణా పరంగా దాచేపల్లి గణనీయంగా ముందుకు రావడంతో ఈ ప్రాంతమంతా ఉద్యోగులు, వ్యాపారులు అధిక సంఖ్యలో స్థిర పడ్డారు.

వేరే సర్వే నంబరుతో రిజిస్ట్రేషన్..

విద్యా, వైద్య పరంగా దాచేపల్లి.. అభివృద్ధి చెందిందే కాని దాచేపల్లి నగర పంచాయతీలో ఆర్అండ్‌బీ బంగ్లా సెంటర్ వెనుక భాగం, అంజనాపురం, నారాయణపురం 14, 15, దుర్గా భవానీ కాలనీలో భూములన్నీ కూడా రాళ్లగుట్ట పోరంబోకుగా ప్రభుత్వ భూముల రికార్డుల్లో నమోదయ్యాయి. ఆర్అండ్‌బీ బంగ్లా సెంటర్ దాచేపల్లికి ప్రధాన ప్రాంతం. ఇక్కడ వ్యాపారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో నివశిస్తుంటారు. దుర్గాభవానీ కాలనీలో వ్యవసాయ కూలీలు, ముగ్గు మిల్లు కార్మికులు నివాసం ఉంటారు. అటు పేదలు కావచ్చు. ఇటు ధనవంతులు కావచ్చు ..అందరికీ కూడా 22ఏ రాళ్లగుట్టగా నమోదైన స్థలాల్లో నివాసం ఉంటున్నారు. వీరు రాళ్లగుట్ట నంబరు కాకుండా.. మరొక సర్వే నంబరు వేసి రిజిస్ట్రేషన్ చేసుకొని అమ్మకాలు, కొనుగోళ్లు సాగిస్తుంటారు.



దాచేపల్లి నగర పంచాయతీ



ఉభయ నష్టదాయకం..

శాటిలైట్ సర్వేలో నివాస ప్రాంతాలు 22ఏగా స్థలాలుగా చూపించడంతో.. ఇళ్లు కొనుగోళ్లు చేసిన లబ్ధిదారులు నగర పంచాయతీలో ఇంటిపన్ను కట్టించుకోవడానికి మునిసిపల్ అధికారులు ముందుకు రావడం లేదు. దీంతో.. ఏటా లక్షల రూపాయలు ఇంటి పన్ను ఆదాయాన్ని నగర పంచాయతీ కోల్పోతుండగా.. స్థానికులకు ప్రభుత్వ పరంగా ఇచ్చే బ్యాంక్ రుణాలు, ఆస్తి హక్కును కోల్పోతున్నారు. ఈ నిబంధన తొలగించాలని స్థానికులు ఎంతో కాలం నుంచి పోరాటం చేస్తున్నప్పటికీ దానిని పట్టించుకున్న వారే లేరు. ఇప్పుడు నగర పంచాయతీలోని నారాయణపురంలో స్థలాల ధరలు గణనీయంగా పెరిగాయి. స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్ల రిజిస్ట్రేషన్‌లు జరిగినప్పుడు నగర పంచాయతీ ఆదాయం వస్తుంది. ఈ విధంగా కూడా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయి. ప్రజలకు ఉపయోగ పడక, ప్రభుత్వానికి ఆదాయం రాక ఉన్న ఈ చట్టాలను మార్చాలని ప్రజలు కోరుతున్నారు. బ్రిటీషు కాలం నాటి చట్టాలే ఇప్పటికీ కొనసాగడం స్థానికులకు ఇబ్బందికరంగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, 22ఏను తొలగించాలని కోరుతున్నారు.

నేడు కార్పొరేషన్ సమావేశం

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ హాలులో జరగనుంది. మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులు, కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టే 120 అంశాలను అజెండాలో పొందుపరిచారు. మొదట ఈనెల 30న సమావేశం జరగాల్సి ఉండగా, ఆ తర్వాత 31వ తేదీకి మార్పు చేశారు. అయితే తిరిగి అత్యవసర సమావేశంగా ఈనెల 29న నిర్వహిస్తుండగా, భారీ అజెండాతో 120 అంశాలను పొందుపరచడం ఇదే తొలిసారి .

ఘనంగా అంకమ్మ తల్లి కొలుపులు

మద్దిపాడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘడియపూడి గ్రామంలో శ్రీ అంకమ్మతల్లి కొలుపులు ఘనంగా జరిగాయి. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడి నిర్మాణానికి సహాయ సహకారాలు అందజేసిన టీడీపీ నాయకులు కావూరి విజయ్‌రాజ్‌ను గ్రామస్థులు, ఎమ్మెల్యే విజయ్ కుమార్ శాలువతో ఘనంగా సత్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, అన్నంనేని సుబ్బారావు, మందపల్లి శ్రీనివాసరావు, పోతినేని శ్రీనివాసరావు, వడ్డెంపూడి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

నటరాజ కళాకేంద్రం అభివృద్ధికి సహకరిస్తా

మద్దిపాడు నటరాజ కళాకేంద్రం అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నటరాజ కళాకేంద్రం ఏడవ వార్షికోత్సవం విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ మాజీ అధికారి రాఘవరావు, సంఘ అధ్యక్షుడు దేవరశెట్టి యలమంద, గంటా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు ఉప్పుగుండూరి నాగేశ్వర రావును ఘనంగా సన్మానించారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం


గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీల విషయంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు ఇస్తున్నారని తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. ఈసందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వారు సంతృప్తిచెందేలా పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు, క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలిచాలన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలను అందజేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఒబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్ రెడ్డి, జాన్సన్, పార్థసారథి, కుమార్ తదితరులు ఉన్నారు.

● ఒంగోలులోని పత్తివారివీధిలో ఉన్న మసీదు ఎన్నికల నిర్వహణలో ఎన్నికల అధికారి ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆ మసీదుకు చెందిన ముస్లింలు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని,అందరి అభిప్రాయాలను తీసుకునే విధంగా చూడాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 84 ఫిర్యాదులు


ఫిర్యాదుదారుల సమస్యను వింటున్నఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం,జూలై 28(ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలు చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి 84 మంది తమ ఫిర్యాదులను అందజేశారు. పోలీసు అధికారులు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, సీఐలు దుర్గా ప్రసాద్ , షమీముల్లా, పాండురంగారావు, ఎస్సై జనార్దనరావు ఉన్నారు.


పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, వేదికపై నగర మేయర్ సుజాత, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య తదితరులు

శతాబ్ది ఉత్సవాల నిర్వహణ అభినందనీయం

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, జూలై 28(ఆంధ్రజ్యోతి):ఒక పాఠశాల స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవటం, ఆ పాఠశాల ఔన్నత్యాన్ని చాటిచెప్పేవిధంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించటం అభినందనీయమని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన రావు అన్నారు. స్థానిక పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల బ్రోచర్‌ను ఆయన సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాల శతాబ్ది ఉత్సవ కమిటీ ప్రతినిధి ఆరిగ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పీవీఆర్ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానాలలో ఉన్నారని, నాటి గురువులను, తోటి విద్యార్థుల స్నేహాన్ని గుర్తుచేసుకునే విధంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించటం గర్వించదగిన విషయమని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహణకు కార్పొరేషన్ తరపున పూర్తి సహకారం అందజేస్తామని తెలిపారు. పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ పీవీఆర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిగా తను ఎంతో గర్వపడతానని అన్నారు. ఒంగోలు మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల ద్వారా 3 వేల మందికి పైగా పూర్వ విద్యార్థులు ఒక చోట కలిసేవిధంగా చేయటం పట్ల నిర్వాహక కమిటీని అభినందించారు. పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొప్పోలు హనుమంతరావు ప్రసంగిస్తూ తన తండ్రి కూడా పీవీఆర్ పాఠశాలలోనే చదివారని, తాను ఇదే పాఠశాలలో చదివి ఆ పాఠశాలలోనే సేవలు అందించటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శాండిల్య, నిర్వహణ కమిటీ ప్రతినిధులు బేతంశెట్టి హరిబాబు, గడియారం సుబ్బయ్య శర్మ, పలువురు పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆరోగ్యభరోసా

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహాయంతో ఆరోగ్య భరోసా లభిస్తుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు రూ. 18.62 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దామచర్ల లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. వివిధ అనారోగ్య కారణాలతో శస్త్ర చికిత్సలు చేయించుకుని, ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ప్రమాదకరంగా కాలువలు

● పగిలిపోయిన పైకప్పు బండలు
● వాటిమీద నుంచే నడిచి వెళుతున్న ప్రజలు


కలెక్టరేట్ వద్ద కాలువపై దెబ్బతిన్న బండలు





ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిపాలన భవన్(కలెక్టరేట్) ముందు ఉన్న కాలువలు ప్రమాదభరితంగా మారాయి. కాలువలపై వేసిన బండలు పగిలిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా కలెక్టరేట్‌కు నిరంతరం జిల్లా నలుమూలలనుంచి ప్రజలు భారీగా తరలివస్తుంటారు. సోమవారం జరిగే గ్రీవెన్స్ రోజుతో పాటు కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాల సమయంలో వివిధ వర్గాల వారు భారీగా తరలివస్తుంటారు. ఆ సమయంలో ధర్నాలను కాలువలపైనే టెంట్లు వేసుకొని నిర్వహిస్తుంటారు. సాధారణంగా నడిచివెళ్లే ప్రజలు ఆ కాలువలపై వేసిన బండలమీదనే నడుచుకుంటూ వెళ్తుంటారు. అయితే కాలువలపై ఉన్న బండలు పగిలిపోయి దర్శనం ఇస్తున్నాయి. ఏదైనా పొరబాటు జరిగితే కాలువలో పడిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కాలువలపై కొత్తబండలు వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న హేతువాద సంఘం నాయకులు

జీవోను ఉపసంహరించుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : పుట్టపర్తి సాయిబాబా వందో శతజయంతి ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. హేతువాద సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే శతజయంతి ఉత్సవాలను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో కాపీలను చించి వేశారు. ఈకార్యక్రమంలో హేతువాద, వివిధ సంఘాల నాయకులు గుమ్మళ్ల నరసింహారావు, ఉప్పుటూరి ప్రకాశరావు, పేరం సత్యం, ఎం.రామ్, శిఖా చంద్రశేఖరరావు, నజీర్, ఎంకే బేగ్ తదితరులు ఉన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కౌన్సెలింగ్ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వివాహానికి ముందు, ఇతర సంబంధిత విషయాలపై మార్గదర్శకత్వం పొందేందుకు ఏర్పాటుచేసిన ప్రీ- మెరిటల్ కౌన్సెలింగ్ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రచురించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌన్సెలింగ్ కేంద్రాల ద్వారా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, ఐసీడీఎస్ పీడీ సువర్ణతో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.

డ్రోన్ టెక్నాలజీ ద్వారా సర్వే చేయాలి

● మద్దిపాడు డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు

మద్దిపాడు, జూలై 28(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతంలో డ్రోన్ టెక్నాలజీ ద్వారా సర్వే చేసి పారదర్శకంగా కొలతలు వేయాలని మద్దిపాడు డిప్యూటీ ఎంపీడీవో కొండేపి రఘుబాబు తెలిపారు. సోమవారం మద్దిపాడు మండల పరిషత్ సమావేశమందిరంలో స్వామిత్వ పథకం అమలుపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్వామిత్వ ఫేజ్ 2 గ్రామ పంచాయతీలుగా ఎన్నికైన అన్నంగి, ఏడుగుండ్లపాడు, గార్లపాడు, కొలచనకోట, లింగంగుంట, మల్లవరం, పెదకొత్తపల్లి, రాచవారిపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సర్వేయర్‌లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథి చంద్రబాబు

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్
● ఇంటింటికీ తిరిగి కరపత్రాల పంపిణీ


మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జులై 28 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమపథకాలను అందించి అదుకుంటున్న సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని గుమ్మళంపాడు గ్రామంలో ఇంటింటికీ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ప్రజలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను మభ్యపెట్టి పరిపాలన సాగించారని, నేడు కూటమి ప్రభుత్వ సారథ్యంలో చంద్రబాబు రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్లతో పాటుగా నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నిర్వహణ, ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, తదితర అంశాలు అమలు చేశారన్నారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

సహకారం దొరికేనా!

(5వ పేజీ తరువాయి)

ఉంచడం వల్ల అన్నదాతలకు సమయం కలిసి రావడంతో పాటు రవాణా ఖర్చులు కూడా భారం కాకుండా ఉంటాయి. ప్రస్తుతం ఆ సదుపాయం లేకపోవడంతో దగ్గరలోని మండల కేంద్రానికి ఎరువుల కోసం అన్నదాతలు వెళ్లాల్సి వస్తోంది. త్వరలోనే కేటాయింపులు జరుగుతాయని జిల్లా సహకార శాఖ యంత్రాంగం చెబుతోంది.

అవకతవకలు జరిగిన ఖాతాలు గుర్తింపు

రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియ ద్వారా మొత్తం 112 సొసైటీల పరిధిలో 75,400 ఖాతాలు ఆన్‌లైన్ గొడుగు కిందకు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో లావాదేవీల విషయంలో పద్దు టాలీ కాని ఖాతాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. ఇందులో ప్రధానంగా పది ఖాతాల్లో భారీగా నిధులు మళ్లింపు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇవన్నీ కూడా నగరం, తుమ్మల సొసైటీలతో పాటు పంగలూరు మండల పరిధిలోని నూజెళ్లపల్లి సొసైటీల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు తేల్చారు. దాదాపు రూ. 4.50 కోట్ల వరకు నిధులు గోల్‌మాల్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. భారీగా జరిగనవి ఇలా ఉంటే లక్ష నుంచి మూడు లక్షల వరకు అక్రమాల సొసైటీలు దాదాపు 40 వరకు ఉన్నట్లు సమాచారం. సాంకేతిక చిక్కులతో డిజిటలైజేషన్ చేయడం సాధ్యపడని దాదాపు 28 ఖాతాలకు సంబంధించిన ఫై అధికారులకు పంపినట్లు యంత్రాంగం చెబుతోంది

అవకతవకల గుర్తింపు సరే...చర్యలేంటి?

గత ఏలుబడిలో భారీగా అక్రమాలు జరిగిన ఖాతాలు గుర్తించారు సరే కాని వారిపై చర్యలేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిధుల రికవరీ దిశగా చర్యలు చేపడతామని గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు త్రీమెన్ కమిటీలు సొసైటీల పగ్గాలు అందుకోబోతున్నాయి. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత కూడా వీరిపైనే ఉంది. అర్హులైన అన్నదాతలకే సొసైటీల నుంచి రుణాలు అందేలా చూడాల్సి ఉంది

ఉద్యోగులను పర్మినెంట్ చేసే విషయంలో

సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు 2014--19 మధ్య ఉన్న టీడీపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ ప్రక్రియ జరుగుతుండగానే ఎన్నికలు రావడంతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఇదే అదనుగా రెగ్యులర్ చేసే విషయంలో ఉద్యోగుల వద్ద నుంచి వైసీపీ నేతలు లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వీటిపై గత ప్రభుత్వంలోనే అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఈ ప్రభుత్వం రాగానే అప్పుడు వచ్చిన ఫిర్యాదులపై శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు తెలిపింది. కానీ అదీ ఇంతవరకు అతీగతీ లేదు. వైసీపీ హయాంలో ఎంతమంది ఉద్యోగులను రెగ్యులర్ చేశారనేదానికి ఆయా విభాగాల వద్ద ఇప్పటికీ సరైన సమాధానం లేకపోవడం గమనార్హం. వీటిపై కూడా త్రీమెన్ కమిటీలు దృష్టి పెట్టి ఎవరైతే అర్హత లేకున్నా దొడ్డిదారిన రెగ్యులర్ చేసుకున్నారో అలాంటి వారందరిపై పునర్విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

హలో.. మాస్టారూ!

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రీ ఆడిట్ ఫైల్‌ను వివిధ కారణాలతో తిరస్కరించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు లేని నిబంధనలు పెట్టి ఉపాధ్యాయులను ఇక్కట్ల పాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది.

పర్సంటేజ్ ఇవ్వాల్సిందే

ఉపాధ్యాయుల ఇంట్లో శుభకార్యాలు, గృహ నిర్మాణం, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యలు తదితర కారణాలతో పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తు చేస్తారు. దరఖాస్తు చేసిన మొత్తాలకు అనుగుణంగా పర్సంటేజ్ ఇవ్వాల్సి వస్తోందని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. రూ.5 లక్షల రుణానికి జడ్పీలో పీఎఫ్ విభాగాల్లో దాదాపు రూ.10 వేలకు పైగా చెల్లించుకోవాల్సి వస్తోందని ఆరోపణలున్నాయి.

ఆరోగ్య సమస్యలున్నా.. వదలడం లేదు

ఉపాధ్యాయులు వివిధ అనారోగ్య సమస్యలతో రుణం కోసం దరఖాస్తు చేసుకుంటారు. ఇందుకు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ ధృవీకరణ పత్రం రుణ దరఖాస్తుకు జత చేస్తే సరిపోతుంది. అయితే జడ్పీలోనే సిబ్బంది మాత్రం ప్రభుత్వ సివిల్ సర్జన్ సర్టిఫికెట్ మాత్రమే అనుమతిస్తామని ఇది లేకపోతే రుణం మంజూరు చేయమని తిరకాసు పెడుతున్నారు. మరోవైపు కాసులు చెల్లిస్తే మాత్రం అన్నింటికీ ఓకే అని చెబుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధ్యాయులకు నోటీసులు..

ఇటీవల పీఎఫ్ చందాల విషయంలో తేడాలు ఉన్నాయంటూ 55 మంది ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులకు నోటీసులు జారీ అయ్యాయి. వాస్తవంగా ఒక నెలలో ట్రెజరీ నుంచి పీఎఫ్ చందా జమ కాకపోతే ఆ మొత్తం రెండో నెలలో కలిపి జమ చేస్తారు. కొన్ని కారణాల వల్ల ఉపాధ్యాయులు సెలవులో ఉంటే చందా జీరోగా ఉంటుంది. ఇలాంటి తేడాలను ఆడిట్ సిబ్బంది సరిచేయకుండా నోటీసులు జారీ చేయడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నారు.

ఆందోళనకు సిద్ధం..

ఇలా వివిధ కారణాలతో ఉపాధ్యాయులను విశ్రాంత ఉపాధ్యాయులను జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ సిబ్బంది వేదనకు గురి చేస్తున్నారు. ఈ బాధలు భరించలేక ఇటీవల కొంతమంది జడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేశారు. అయినా కూడా సమస్య పరిష్కారం కావడం లేదని, ఇక తాము జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తామని సీఈఓకు స్పష్టం చేశారు. ఇలా జడ్పీలోని పీఎఫ్ ఆడిట్ విభాగాల సిబ్బంది ఉపాధ్యాయులను, విశ్రాంత ఉపాధ్యాయులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నారు


మాట్లాడుతున్న సీఐ హాజరత్తయ్య

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

● సీఐ హాజరత్తయ్య

సింగరాయకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చావా హాజరత్తయ్య హెచ్చరించారు. అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.స్థానిక విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరా చేసుకొని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సమాజంలో మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయని, పాశవికమైన ఆలోచనల వలనే ఇటువంటివి చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల ఆలోచనా విధానాల్లో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

పొన్నలూరు : కొండపి సీఐ సోమశేఖర్ సోమవారం పొన్నలూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్సై అనూక్, సిబ్బందితో సమావేశమయ్యారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి దర్యాప్తు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు.

కుడికాల్వకు నీటి విడుదల

(5వ పేజీ తరువాయి)

తెలంగాణ మంత్రులు విడుదల చేయనున్నారు. ముగ్గురు మంత్రులు కార్యక్రమానికి హాజరవుతున్నట్లు సదరు ఇంజనీరు తెలిపారు. సాగర్ డ్యాంకు 1,20,175 కూస్కెల వరద ప్రవాహం వస్తోంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతలకు నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలతో పాటు సాగర్ నుంచి దిగువకు 36,749 కూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 585 అడుకులకు చేరుకుంది. ఇంకా ఐదు అడుగులకు చేరితే.. డ్యాం పూర్తిగా నిండుతుంది. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా 297 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది.

పులిచింతలకు 25 వేల కూసెక్కులు

సాగర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా పులిచింతల జలాశయానికి 25 వేల కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం నీట్టి మట్టం 175 అడుగులు కాగా సోమవారం 160.3 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 25.9 టీఎంసీలకు చేరింది. మరో 19.87 టీఎంసీల నీరు వస్తే పులిచింతల నిండుతుంది. మరో మూడు రోజుల్లో పులిచింతల డ్యాం కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారుల అంచనాగా ఉంది. దీంతో ఈ నెలలోనే పులిచింతల గేట్లు తెరచుకోనున్నాయి.

అవీ..ఇవీ..

పిచ్చికుక్క కాటుకు ఆవు బలి


సోమవారం ప్రాణాలతో ఉన్న ఆవు

మార్టూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క కాటుకు ఆవు బలైన ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని వలపర్ల గ్రామ పంచాయతీలోని ద్వారకపాడు గ్రామంలో చోటుచేసుకొంది. వారం రోజులు క్రితం మువ్వా శేషయ్యకు చెందిన పశువుల కొష్టంలో కట్టేసిన ఆవును పిచ్చికుక్క కరిచింది. దాంతో అప్పటినుండి మేత మేయకుండా, నీళ్ల తాగకుండా, దగ్గరకు వచ్చినవారిని పొడుస్తూ, వింతగా ప్రవర్తించిన ఆవు సోమవారం సాయంత్రం చనిపోయినట్లు రైతు శేషయ్య తెలిపారు. నాలుగేళ్ల క్రితం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు టీటీడీఆ గోశాల నుండి ఆవులను అ ందచేశారు. అందులో భాగంగా శేషయ్యకు కూడా ఆవును అందచేశారు. దీంతో ప్రకృతి వ్యవసాయంలో ఆవు మూత్రం, పేడను పొలానికి ఎరువుగా వినియోగించారు. అయితే పశువైద్యులతో వైద్యం చేయించినప్పటికీ, ఆవు కోలుకోలేదని శేషయ్య, ఆయన కుటుంబ సభ్యులు వాపోయారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి

• ఆర్డీవోను కలిసిన వాడరేవు మత్స్యకారులు


ఆర్‌డీవోకు సమస్యను వివరిస్తున్న మత్స్యకారులు

చీరాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వాడరేవు మత్స్యకారులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈపూరుపాలెం కాలువలో కొంత కాలంగా వేట అనంతరం బోట్లు నిలుపుకునే స్థలంలో తాజా పరిణామాల నేపథ్యంలో విస్తీర్ణం పరిధి తగ్గిందని, ఆర్డీవో దృష్టికి తీసుకు వెళ్లారు. ఈక్రమంలో బోట్లు రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవోను కలసి వివరించారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

పందిళ్లపల్లి(చీరాల), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ఐదుగురు నిరుపేద విద్యార్థులకు శ్రీరామకృష్ణ సేవాసమితి చీరాల ప్రతినిధులు స్కాలర్‌షిప్ ప్రోత్సాహం అందజేశారు. దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని దాతలు కోరారు.

సెయింట్ ఆన్స్‌లో ఏఐపై వర్క్‌షాపు

చీరాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం డ్రోన్ డెవలప్‌మెంట్ యూజింగ్ ఏఐపై వర్క్‌షాపు ప్రారంభించారు. ఈక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు మాట్లాడుతూ శుక్రవారం వరకు జరిగే ఈ అవగాహనలో ఆధునిక సాంకేతిక పరమైన అంశాలపై నిష్ణాతులుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. హైదారాబాదుకు చెందిన ఆర్బిస్ స్మార్ట్, ఈపీఐటీ రీసెర్చ్ ల్యాబ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బసవయ్యకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న బసవయ్య

సంతమాగులూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మక్కెన వారిపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ చెన్నుపల్లి బసవయ్యకు తెలుగు సాంస్కృతిక సాహితి ట్రస్టు వారు ఈ నెల 27న కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరు పట్టణంలో డాక్టరేట్ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బల్లికురవ మండల విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గుంటుపల్లి రామకృష్ణ, ప్రసన్నాంజనేయస్వామి విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం కమిటీ కూడా అభినందనలు తెలిపారు.

మినీ బైపాస్‌కు తొలగిన అడ్డంకులు

• నిర్వాసితులకు ప్రత్యామ్నాయ స్థలాల గుర్తింపు
• మౌలిక వసతుల కల్పనకు టెండర్ల ప్రక్రియపై కసరత్తు


అద్దంకి కొండ వద్ద సిద్ధం చేస్తున్న ప్లాట్లు

అద్దంకి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఒకవైపు టెండర్ల ప్రక్రియకు వేగంగా ఫైళ్లు కదులుతుండగా, మరోవైపు ఉన్న అడ్డంకులను కూడా అధికారులు వేగంగా పరిష్కరిస్తున్నారు. మినీ బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసే అద్దంకి మేజర్ కాలువ కట్టలను ఆక్రమించి పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వారికి ప్రస్తుతం ప్రత్యామ్నాయం చూపుతూ స్థలాలు కేటాయిస్తున్నారు. అద్దంకి మేజర్ కాలువ కట్టలను రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు రెండు వైపులా సీసీ రోడ్లు, సైడ్‌డ్రైయిన్లు, లైట్లు తదితర పనులకు సుమారు రూ.15 కోట్లతో చేపట్టేందుకు టెండర్ల పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఫైల్ ప్రభుత్వ అనుమతికి వెళ్లింది. ఈ లోగా 70 కుటుంబాలు కాలువ కట్టలను ఆక్రమించి నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. ఆయా కుటుంబాలకు శింగరకొండపాలెం సమీపంలో అద్దంకి కొండ వద్ద స్థలాల కేటాయింపునకు ఏర్పాట్లు చేశారు. లోతైన గోయ్యి ఉండటంతో మెఘా ఇంజనీరింగ్ కంపెనీ సహకారంతో చదును చేయించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థలాన్ని ప్లాట్లుగా విభజించారు. రోడ్ల పోను ఒక్కొక్కరికి 2 సెంట్లు చొప్పున కేటాయించగా 42 ప్లాట్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన మరి 28 మందికి ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. అదే ప్రాంతంలో మరికొంత కొండ ప్రాంతాన్ని చదును చేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. ప్లాట్లు వేసిన ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, రోడ్లు, బోరింగ్‌లు కూడా ఏర్పాటు చేయాలని మంత్రి రవికుమార్ ఆదేశించారు. ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో అటు మినీ బైపాస్ నిర్మాణం టెండర్ల ప్రక్రియ, మరో వైపు స్థలాల కేటాయింపు పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందడుగు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలు మండలంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం పర్యటించారు. ప్రధానంగా నల్లబర్లీ రైతుల సమస్యపై ప్రత్యేక దృష్టిసారించారు. బర్లీ పొగాకు కొనుగోలు విషయానికి సంబంధించి రైతుల నుండి పలు సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. అనంతరం మార్టూరు మండలం ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూర క్యాంపు కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్బంగా ఏలూరి మాట్లాడుతూ ఇంకొల్లు మండలానికి సంబంధించిన రైతులకు సంబంధించిన పొగాకును అమ్ముకునేందుకు వీలుగా గుండ్లాపల్లిలో నూతన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటగా 20 క్వింటాళ్ల పొగాకు ఉన్న చిన్న, సన్నకారు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తర్వాత మిగిలిన రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేస్తామన్నారు. సన్న, చిన్నకారు రైతులు పడుతున్న ఇబ్బందులను ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయిన వెంటనే ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. రైతులు అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. ప్రతి రైతువద్ద ఉన్న పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతురావు, పీఏసీఎస్ అధ్యక్షులు కర్రీ శ్రీనివాసరావు, సుబ్బారావు, రాంబాబు, నాయకులు వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఘర్షణతో చీరాల వాసుల ఉలికిపాటు

తక్షణమే స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు


గస్తీని పర్యవేక్షిస్తున్న పోలీసులు

చీరాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : సోమవారం 9.30 గంటల వరకు ప్రశాంతంగా ఉన్న చీరాల పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. 'రయ్... రయ్' మంటూ సైరన్లతో పోలీసులు పట్టణంలోని ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ వైపు వెళ్లారు. ఈ లోగా పోలీసులను చూసి అక్కడ ఉన్న సుమారు 20 మంది యువకులు వివిధ దిక్కులవైపు పరుగులు తీశారు. వీరు రెండు గ్రూపులుగా ఏర్పడి పరస్పర దాడులు చేసుకున్నట్లు తెలిసింది. వీరిలో ఒకవర్గానికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం.

పట్టణంలోని ఎన్‌ఆర్‌అండ్‌పీఎం స్కూల్ గ్రౌండ్‌లో రాత్రి వేళలో సైతం వివిధ క్రీడలు సాధన చేస్తూ, యువత, పలువురు క్రీడాకారులు ఉంటారు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి కూడా పలువురు యువకులు ఆటలు ఆడుతున్నారు. అప్పటికే సుమారు పది మంది విద్యార్థులు ఓ పెద్ద సుత్తితో సోమవారం రాత్రి మైదానానికి చేరుకు న్నారు. పథకం ప్రకారం ఎంచుకున్న మరో పదిమందిపై ఒక్కసారిగా దాడికి తెగ బడ్డారు. దీంతో అప్పటికే అవతలి వర్గంలో కొందరు విద్యార్థులు పరుగులు తీసి తప్పించుకొన్నారు. మిగిలిన ఐదుగురిపై సుత్తితో, కాళ్లతో, పిడి గుద్దు లతో విచక్షణ రహితంగా వీధి మారి దాడులు చేశారు. దండం పెట్టి మోకరిల్లుతున్న వదలలేదని తెలిసింది. అదే సమయంలో సమాచారం అందుకున్న సీఐ సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మీతో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిని చూసి నిందితులు పరారవు తుండగా, వీరిలో ఇద్దరిని అదుపులోకి తీసుకు న్నారు. వీరు ఒకొక్కరూ ఒక్కో వర్గానికి చెందినట్లు తెలిసింది. వీరు ఉపయోగించిన సుత్తిని, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో ఒక దశలో గంటపాటు పట్టణమంతా ఆందోళన వాతావరణం నెలకొంది. ముందు జాగ్రత్త చర్యగా పట్టణంలోని దుకాణాలను పోలీసులు మూసివేయించారు.

ఒకే కళాశాల విద్యార్థులు..!

పట్టణంలోని ఒకే కళాశాలకు చెందిన విద్యార్థులుగా ప్రాథమికంగా తెలిసింది. వీరిలో ఒకవర్గం పేరాల మసీదు సెంటర్‌వారు కాగా, మరోవర్గం వైకుంఠపురం వారిగా గుర్తించి మిగిలిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం


నేత్రం దానంలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 28(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం నేత్రదానం నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కూరగాయల వ్యాపారి మారం మల్లయ్య(80) మృతి చెందాడు. ఈ సందర్భంగా రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు ప్రోత్సహంతో మల్లయ్య కుటుంబ సభ్యుల అంగీకారంతో పెదకాకానిలోని శంకర కంటి వైద్యశాల చెందిన డాక్టర్ శ్రద్ధా బృందం మృతుని కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి అ లహరి హరిప్రసాద్, చప్పిడి వీ రయ్య, చిన్ని మురళీకృష్ణ, షేక్ మహమ్మద్ రఫీ, అంజద్‌బాషా, మల్లయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

400 క్వింటాళ్ల పొగాకు కొనుగోలు

• తహసీల్దార్ సింగారావు


పొగాకు కొనుగోలును పరిశీలిస్తున్న తహసీల్దార్

పంగులూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ఏఎంసీలో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రంలో సోమవారం 400 క్వీటాళ్ల పొగాకు కొనుగోలు చేసినట్లు తహసీల్దార్ పి.సింగారావు తెలిపారు. కొనుగోలు కేంద్రానికి ఉన్నతాధికారుల నుంచి అందిన సమాచారం మేరకు రైతులు 761 క్వింటాళ్ల కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా మార్క్‌ఫెడ్ అధికారుల అనుమతి మేరకు పొగాకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. తేమశాతం, గ్రేడ్‌ల విభజనలో రైతులు నిబంధనలు పాటించాలని సీఈవో లక్ష్మీదేవి తెలిపారు.

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

• సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చావా హజరత్తయ్య హెచ్చరించారు. అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.స్థానిక విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరా చేసుకొని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిపై విద్యార్థులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సమాజంలో మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయని, పాశవికమైన ఆలోచనల వలనే ఇటువంటివి చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల ఆలోచనా విధానాల్లో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సైకం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

పొన్నలూరు : కొండపి సీఐ సోమశేఖర్ సోమవారం పొన్నలూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్సై అనూక్, సిబ్బందితో సమావేశమయ్యారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి దర్యాప్తు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు.

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన

మార్టూరు,జూలై28(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. పట్టణంలోని మద్ది సత్యనారాయణ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లోని ప్రతి తరగతిని పరిశీలించారు. బాలబాలికలతో మాట్లాడారు. అదేవిధంగా వారికి పలు సూచనలు చేశారు. చక్కగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ఎంఈవోలు వస్రాంనాయక్, ప్రేమలతలు, ప్రధానోపాధ్యాయురాలు రూత్ మెర్సీజాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోగా శ్రీనివాసరావు బాధ్యతలు


బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు

బల్లికురవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారిగా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మార్టురు ఎంఈవో ఇన్‌చార్జ్‌గా ఉండడంతో ఉన్నతాధికారులు అద్దంకి బాలికల విద్యాలయం హెచ్‌ఎంగా పనిచేస్తున్న కటకం శ్రీనివాసరావును బల్లికురవ ఎంఈవో-1 పోస్టుకు నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు బల్లికురవ హెచ్‌ఈ మోడల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ పాఠశాలలను తనిఖీలు చేస్తామన్నారు.

యానాది సంఘం నాయకుడు కృష్ణ ఆకస్మిక మృతి


కృష్ణ (ఫైల్)

సంతమాగులూరు జూలై 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పాతమాగులూరు గ్రామంలోని యానాది కాలనీకి చెందిన, ఆ సంఘం నాయకుడు తలపల కృష్ణ సోమవారం గుండెపోటుతో తన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కృష్ణ మండల యానాది సంఘం అధ్యక్షులుగా పనిచేస్తూ, యానాదుల సంక్షేమం కోసం, వారి హక్కుల కోసం పలు పోరాటాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎనుబర్ల ఎలమంద, గ్రామ సర్పంచి జిర్రా విజయబాబు, పలు సంఘాల నాయకులు కృష్ణ భౌతికయం వద్ద నివాళి అర్పించారు.

ప్రకృతి సేద్యంతో చక్కని ఆరోగ్యం

పందిళ్లపల్లి(చీరాల), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఆహారంతో ఆరోగ్యంగా జీవించవచ్చని, పందిళ్లపల్లి ప్రిపేర్ సేవాసంస్థ ప్రతినిధులు అన్నారు. సోమవారం గ్రామంలో రైతులకు సేంద్రీయ సాగుపై అవగాహన కల్పించారు. కొంతకాలంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపుతున్నట్లు చెప్పారు. అలాగే పదిమందికి రూ.6,10లక్షలు వ్యవసాయ రుణం అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు రవిచంద్ర, ఆషా, వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్ రెడ్డి, మయూరి, రమణారెడ్డి, కమ్యూనిటి హెల్త్ నర్సులు, రైతులు పాల్గొన్నారు.

మిగిలిన నగదు వెంటనే జమచేయాలి

బల్లికురవ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ అనంతరం మిగిలిన నగదును జమచేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి, పాండురంగస్వామి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పింఛన్లు ఒకటో తేదీనే నూరు శాతం పంపిణీ చేయాలన్నారు. ఎవరైన గ్రామాలలో లేకుంటే వారికి ఇవ్వాల్సిన నగదు తిరిగి బ్యాంకులలో జమ చేయాలన్నారు. అలానే గ్రామాలలో పీ-4 లబ్దిదారులను గుర్తించి వారికి మార్గదర్శకులను ఎంపిక చేయాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తగా పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.

రైతులకు ఉచితంగా మినుము విత్తనాల పంపిణీ

మార్టూరు, జూలై28(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి గ్రామంలో సోమవారం రైతుసేవా కేంద్రంలో రైతులకు ఉచితంగా మినుములును పంపిణీ చేశారు. తొలకరి మొదలు కావడంతో రైతులు పొలంలో వెంటనే మినుములను వేయాలని నీటి సంఘం అధ్యక్షులు తేలప్రోలు సుబ్బారావు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యం సతీష్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాటి నాగార్జున, అగ్రికల్ అసిస్టెంట్ వెంగమాంబ, మురళి, సాంబయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా బ్రహ్మానందస్వామి


బ్రహ్మానందస్వామి

పంగులూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేవీ.పాలెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా ముప్పవరం గ్రామానికి చెందిన అల్లంనేని బ్రహ్మానందస్వామి నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు. పాలకవర్గ సభ్యులుగా కశ్యాపురం గ్రామానికి చెందిన దూళిపాళ్ల ప్రసన్నాంజనేయులు, రేణంగివరం గ్రామానికి చెందిన మట్టకొయ్య బ్రహ్మయ్యలు మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

ఈపూరుపాలెం (చీరాల), జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మీ సేవాలో చోరీకు పాల్పడిన శ్రీకాకుళం జిల్లా పలాస మండలం, పద్మనాభపురానికి చెందిన గోలంగి ప్రవీణ్ కుమార్‌కు ఏడు నెలలు జైలుశిక్ష విధిస్తూ, చీరాల అదనపు జూనియర్ సివిల్ జడ్జి తీర్పును వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఈపూరు పాలెం కాటూరి చెంబయ్యకు చెందిన మీసేవా కేంద్రంలో ప్రవీణ్‌కుమార్ గతేడాది నవంబర్‌లో చోరీకి పాల్పడ్డాడు. రూ.40 వేలు అపహరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. ఈ కేసులో సోమవారం న్యాయాధికారి తీర్పును వెలువడించినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

మేదరమెట్ల, జూలై 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉచితంగా సైకిళ్లు పంపిణి చేయనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నూతన విద్యా విధానాలను అమలు చేయాలి

అద్దంకిటౌన్, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్ మీడియట్‌లో నూతనం గా ప్రవేశపెట్టిన విధానాలను ప్రతి కళా శాలలో అమలుచేయాలని డీఐఈవో జూబేర్ సూచించారు. సోమవారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని అధ్యాపకులతో సమా వేశం నిర్వహించి ఇంటర్‌మీడియట్ బోర్డు నూతనంగా ప్రవేశపెట్టిన విధి వి ధానాలపై అవగాహన కల్పించారు. ద్వితీయ సంవత్సరంలానే ప్రథమ సంవత్సరంలోనూ ప్రాటికల్స్ ఉంటాయ న్నారు. సబ్జెట్‌ల కుదింపును తెలుసు కుని ఆ ప్రకారం బోధన చేయాలన్నారు. అనంతరం జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం గురించి విద్యార్థు లతో మాట్లాడి తెలుసుకున్నారు. అనం తరం పట్టణంలోని పలు ప్రైవేట్ జూని యర్ కళాశాలను ఆయన సందర్శిం చారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ఉన్నారు.

భూముల అక్రమ ఆన్‌లైన్‌ను రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం చెర్వుకొమ్ముపాలెంలో మాదిగ కులానికి చెందిన వ్యక్తుల భూములను అక్రమంగా చేసిన ఆన్‌లైన్‌ను రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ దళితుల భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సమితి నాయకులు పేముల యోహాను, షేక్ జిలాని, ఎస్. ధనరాజ్, టి. సుబ్బారావు, కే చక్రవర్తి, పెద్ద నరసయ్య, బి.సుశీల, మూల యలమందమ్మ తదితరులు ఉన్నారు.